

ఎన్నాళ్లీ అవస్థలు

- పూర్తికాని వంతెనలు
- ముందుకు సాగని అనుసంధాన రోడ్ల పనులు
- నాలుగేళ్ల క్రితం అధికారులు ప్రతిపాదనలు
- నిధుల మంజూరుకు ఎదురుచూపులు
- వర్షాకాలంలో నిలిచిపోతున్న రాకపోకలు



కాగజ్‌నగర్-వాంకిడి మధ్యలో నిర్మాణ దశలోనే ఉన్న వంతెన

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం జిల్లాలో వివిధ మండలాల అనుసంధానంగా ఉన్న వంతెనలు, రోడ్ల పనులు పూర్తి కాక పోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. వివిధ మండలాలకు అనుసంధానంగా ఉండేందుకు రోడ్లు, వంతెనల కోసం పనులు అధికారులు పూర్తి స్థాయిలో ప్రతిపాదనలు ఉన్నతాధికారులకు పంపించారు. ఇంత వరకు నిధులు విడుదల కాక పోవడంతో పనులు సాగడం లేదు. దీంతో వాహనదారులు రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

● అంకుసాపూర్ వద్ద

కాగజ్‌నగర్-వాంకిడి మధ్యలో ఉన్న అంకుసాపూర్ వద్ద బ్రిడ్జి నిర్మాణం 2013లో రూ.1.50 కోట్లతో పనులను ప్రారంభించారు. అప్పటి ప్రభుత్వం విడుదల చేసిన నిధుతో పనులు ప్రారంభించారు. రాష్ట్రాలు విడి పోవడంతో ఈ వంతెన నిర్మాణం కోసం నిధులు విడుదల కాక పోవడంతో పెండింగ్‌లో ఉండాల్సి వచ్చింది. ఏళ్లు గడుస్తుండడంతో వంతెన నిర్మాణానికి సంబంధించిన మెటీరియల్ ధరలు రెండింతలు పెరుగడంతో కాంట్రాక్టర్ చేతులెత్తేశారు. దీంతో సమస్య మళ్లీ మొదటికొచ్చినట్లయింది. పెండింగ్ ప్రాజెక్టుపై గత ప్రభుత్వం సర్వేలు చేపట్టింది. ఈ సర్వేలో ఈ ప్రాజెక్టు పూర్తి చేసేందుకు రూ.3 కోట్ల నిధులు అవసరం అవుతాయని ప్రతిపాదించారు. దీంతో ప్రభుత్వం మూడేళ్ల క్రితం రూ.3కోట్ల నిధులను పెంచింది. కాని ఆశించిన మేర నిధులు విడుదల కాలేదు.



సైపులతో తాత్కాలికంగా వేసిన రోడ్డు

దీంతో పనులు నిలిచిపోయాయి. కాగజ్‌నగర్ నుంచి వాంకిడి వెళ్లాలంటే ఆసిఫాబాద్ మీదుగా సరిగ్గా 41 కిలో మీటర్లు దూరం ఉంటుంది. ఆసిఫాబాద్‌కు మీదుగా కాకుండా కాగజ్‌నగర్ నుంచి అంకుసాపూర్ మీదుగా వాంకిడికి వెళ్లితే 25 కిలోమీటర్లు వస్తోంది. రవాణా సౌకర్యంతో పాటు దూరం తగ్గుతుందన్న ఉద్దేశ్యంతో అంకుసాపూర్ వాగుపై ఉన్న వంతెన నిర్మించేందుకు పనులు ప్రారంభించారు. ఈ వంతెన పిల్లర్ల స్థాయి వీడని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం తాత్కాలికంగా సైపులు వేసి మట్టి రోడ్డు వేశారు. చిన్న పాటి వర్షం కురిసిందంటే ఈ వంతెనకు సమీపం దూరంలో కొండలపై నుంచి నీరు అధికంగా వచ్చి తాత్కాలిక రోడ్డు కొట్టుక పోతోందని గ్రామస్తులు తెలిపారు. వర్షాకాలంలో ఎడ్ల బండి సహాయం తోనే వాగు దాటాల్సి ఉంటుందని, బైక్‌లను కర్రల సహాయంతో తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఏటా తమకు తిప్పలు తప్పడం లేదని వాపోతున్నారు. ఈ విషయాన్ని జిల్లా స్థాయి అధికారులకు, నాయకుల దృష్టికి తీసుక పోయినా కూడా పరిస్థితి ఏ మాత్రం మారడం లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

● పాలవాగు ఉధృతంగా ప్రవహిస్తే..

కాగజ్‌నగర్-భీమిని మండలాల అనుసంధానంగా జగన్నాథ్‌పూర్ మీదుగా వెళ్లే రహదారిపై ఉన్న పాలవాగు ఉధృతంగా ప్రవహిస్తే రాకపోకలు నిలిచిపోతు న్నాయి. ఈ వాగు కూడా చిన్నపాటి వర్షానికే ఉధృ తంగా ప్రవహిస్తోంది. వరదనీరు ఉధృతంగా ప్రవహిస్తే ఎడ్లబళ్ల ద్వారానే ఈ వాగును దాటాల్సిన పరిస్థితి ఉంటుంది. ఈ రెండు మండలాలకు అనుసంధానంగా ఉన్న రోడ్లను అభివృద్ధి పరిచేందుకు రెండు మండలాల అధికారులు సమగ్ర స్థాయిలో సర్వేలు నిర్వహించారు. శాశ్వత దిశగా ప్రణాళికలు కూడా రూపొందించారు. రూ.10 కోట్ల నిధులు అవసరమున్నట్టు అధికారులు అంచనా వేసి ఉన్నతాధికారుకు పంపించారు. మంచిర్యాల, కుమరం భీం జిల్లాలకు వ్యాపార రంగంతో పాటు, రవాణా వ్యవస్థ ఎంతో మెరుగు ఉండే అవకాశాలున్నప్పటికీ కూడా నిధులు కాక పోవడంతో రోడ్డు , వంతెన సౌకర్యం లేక పోవటంతో వర్షాకాలంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. భీమిని మండలానికి అతి దగ్గరగా ఉండడంతో ఈ దారిలో ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. భీమినిలో రైతులు పండించిన పంటలన్నింటినీ కూడా సమీపంలో ఉండే కాగజ్‌నగర్ వ్యాపారుల వద్దనే అధికంగా విక్రయాలు జరుపుతుంటారు. దీంతో ఆర్థిక వ్యవస్థ కూడా బలోపేతం అవుతోంది. అధికారులు స్పందించి రోడ్లు, వంతెన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వంతెన పూర్తి చేయాలి..

- కలికోట రమణయ్య, కాగజ్‌నగర్



అధికారులు కాగజ్‌నగర్-వాంకిడి మధ్య ఉన్న వంతెన పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలి. వంతెన పూర్తయితే నేరుగా కాగజ్‌నగర్-వాంకిడికి వెళ్లేందుకు అవకాశం ఉంటుంది. వర్షాకాలంలో వర దలకు రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతున్నాయి. అధికారులు పనులు పూర్తయ్యేలా చూడాలి.

ఏళ్ల తరబడి ఇబ్బందులు..

- సిద్దం శ్రీనివాస్, కాగజ్‌నగర్



ఏళ్ల తరబడి వంతెనలు, రోడ్లు పూర్తి చేయక పోవడంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. తాత్కాలిక రోడ్లు వేసి అధికారులు తమ పని అయిపోయినట్లు చూస్తున్నారు. వర్షాకాలంలో వరదలు వస్తే మట్టి కొట్టుకుపోయి రోజుల తరబ డి ఇబ్బందులు పడుతున్నాం. ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలి.

నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్



మాట్లాడుతున్న సీఐ బుద్దేస్వామి

తిర్యాణి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకే కార్డన్‌సెర్చ్ నిర్వహిస్తున్నామని సీఐ బుద్దేస్వామి అన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు, ఏఎస్పీ చిత్తరంజన్ ఆదేశాల మేరకు ఎస్సై శ్రీకాంత్‌తో కలిసి మండలంలోని నాయకపుగూడ గ్రామంలో శుక్రవారం పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా 200 ఇళ్లను సోదా చేశారు. నంబర్ ప్లేట్లు, ఇన్సూరెన్స్, పత్రాలు లేని 10 వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నేరాల నిర్మూలనకు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజల రక్షణ, భద్రత భావం, సెన్సాప్ సెక్యూరిటీ కల్పించడం గురించి, ఎవరైనా కొత్త వ్యక్తులు గాని, నేరస్తులు గానీ వచ్చి షెల్టర్ తీసుకుంటున్నారా అని అడిగి తెలుసుకున్నారు. గ్రామాల్లో నిషేధిత గుడుంబా తయారీ, విక్రయం చట్ట రీత్యా నేరమని, చెప్పారు. సైబర్ నేరాల అప్రమత్తంగా ఉండాలన్నారు. మోసపోయినట్లయితే వెంటనే 1930 లేదా డయల్ 100కి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సైలు చంద్రశేఖర్, ఆర్ఎస్సై సందీప్, ఏఎస్సైలు నారాయణసింగ్, వేణుగోపాల్, కానిస్టేబుల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ చర్యలు


ఆసిఫాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టాస్) పదో తరగతి, ఇంటర్మీడియట్ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి 26 వరకు నిర్వహించనున్న ఓపెన్ టెన్త్, ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ చర్యలు చేపడుతున్నామని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు తెలిపారు. జిల్లాలోని ఆసిఫాబాద్ జడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాల, కాగజ్‌నగర్ జడ్పీఎస్ఎస్ బాలికల పాఠశాల, జన్కాపూర్ జడ్పీఎస్ఎస్ పాఠశాల కాగజ్‌నగర్ జడ్పీఎస్ఎస్ పాఠశాల పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్ అమలులో ఉంటుం దన్నారు. పరీక్షా కేంద్రం నుంచి 500 మీటర్ల వరకు ప్రజలు గుమిగూడి ఉండకూడదని చెప్పారు. పరీక్షలకు కట్టుదిట్టమైన భద్రతా చర్యలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది పరీక్ష సమయంలో పెట్రోలింగ్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

సాంకేతిక లోపంతో నిలిచిపోయిన రైలు

కాగజ్‌నగర్ టౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో సాంకేతిక లోపంతో అరగంట పాటు శుక్రవారం ఏపీ ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నంబరు 20805) రైలు నిలిపోయింది. విశాఖపట్నం నుంచి న్యూఢిల్లీ వెళ్లే ఆంధ్రప్రదేశ్ ఏపీ ఏసీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నంబరు 20805) కాగజ్‌నగర్‌కు ఉదయం 9.39కు వచ్చి 9.41కు బయలుదేరాలి వెళ్లాల్సి ఉంది. ఉదయం 10.02 నిమిషాలకు కాగజ్‌నగర్ చేరుకుంది. రైలు బ్రేకుల్లో ఏర్పడ్డ సాంకేతిక లోపంతోనే కాగజ్‌గనర్‌లో అరగంట పాటు నిలిపివేశారు. రైల్వే సిబ్బంది సాంకేతిక లోపం గ్రహించి నిలిపివేశారు. మరమ్మతుల అనంతరం తిరిగి రైలు 10.39 నిమిషాలకు బయలుదేరి వెళ్లిందని రైల్వే అధికారులు వివరించారు.

సమయపాలన పాటించని వైద్యుడు

రోగుల ఇబ్బందులు



ఖాళీగా ఉన్న వైద్యుడి కుర్చీ

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ సీహెచ్‌సీలో శుక్రవారం వైద్యుడు సమయానికి విధులకు రాక పోవడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. ఉదయం నుంచి వైద్యుడి కోసం వేచి చూసి సిబ్బందిని అడిగారు. గుడ్‌ఫ్రైడే కావడంతో వైద్యడు రాలేదని తెలియడంతో కొంత మంది యువకులు జిల్లా వైద్యాధికారికి సమాచారం అందించారు. గుడ్‌ఫ్రైడే సెలవు ఉన్నప్పటికీ కూడా నిబంధనల ప్రకారం మధ్యాహ్నం 12 గంటల వరకు విధులు నిర్వహించాల్సి ఉంటుంది. నోటీసు బోర్డుపై కూడా వైద్యుడు డ్యూటీలో ఉన్నట్టు రాసి పెట్టారు. వైద్యడు రాకపోవడంతో చివరకు అత్యవసర విభాగంలో ఉన్న నర్సు మాత్రలు అందజేసి రోగులను పంపించింది. విధులకు సమయానికి హాజరు కాని డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని ఎం ముజామిల్‌తో పాటు కొందరు యువకులు ఉన్నతాకారులకు ఫిర్యాదు చేశారు.

బిల్డింగ్‌పై నుంచి పడి వృద్ధురాలి మృతి

పెంచికలపేట, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సముద్రాల రుక్మిణి(78) అనే వృద్ధురాలు ప్రమాదవశాత్తు బిల్డింగ్ పై నుంచి పడి శుక్రవారం మృతి చెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం తెల్లవారు జామున బిల్డింగ్‌పైకి ఎక్కి అక్కడ ఏర్పాటు చేసిన హనుమాన్ జెండాలను తొలగిస్తున్నది. బిల్డింగ్ చివరికి చేరుకున్న విషయం గమనించకపోవడంతో కింద పడిపోయింది. దీంతో తల వెనక భాగంలో బలమైన గాయం తగలడంతో స్పృహ కోల్పోయింది. కుటుంబ సభ్యులు కాగజ్‌నగర్ లోని ప్రైవేటు ఆసుపత్రికి తర లించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

వ్యక్తిగత పనులకు అంబులెన్స్ వినియోగం



శుభకార్యానికి తీసుకెళ్లిన అంబులెన్స్

పెంచికలపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పనుల కు సిబ్బంది అంబు లెన్స్‌ను వినియోగిం చుకున్న విషయం సోషల్‌మీడియాలో శుక్రవారం వైరల్‌గా మారింది. రాష్ట్ర ప్రభుత్వం 102 వాహనాన్ని ప్రతి ప్రభుత్వ ఆసుపత్రికి ఒకటి కేటాయించింది. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి కేటాయించిన 102 అమ్మఒడి వాహనాన్ని సిబ్బంది మంచిర్యాల జిల్లాలోని ఒక గ్రామంలో జరిగిన శుభకార్యానికి తీసుకెళ్లారు. గవ నించిన కొంత మంది యువకులు వీడియోలు తీసి సోషల్ మీడి యాలో షేర్ చేయడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయమై జిల్లా వైద్యాధికారి సీతారాంను వివరణ కోరగా వ్యక్తిగత అవసరాల కోసం వినియోగించ కూడదని చెప్పారు. విచారణ చేపట్టి చర్యలు తీసు కుంటామని తెలిపారు.

మహిళా అఘోరిపై చర్యలు తీసుకోవాలి

వాంకిడి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లోని మంగళగిరికి చెందిన యువతని పెళ్లి చేసుకున్న లేడీ అఘోరిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కఠిన చర్యలు తీసుకోవాలని దళిత సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక జైత్వాన్ బుద్ధ విహార్‌లో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో పలువురు మాట్లాడారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరైందని కాదన్నారు. సమాజంలో అలజడి సృష్టిస్తున్న ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బౌద్ధ మహాసభ సభ్యులు అశోక్, సందీప్, విజయ్, హంసరాజ్, ప్రతాప్, విలాస్, శివాజీ, జైపాల్, మహేష్, చింటు, డిలాజీ, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ డిపోలో మర్యాదపూర్వక దినోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ ఆర్టీసీ డిపోలో శుక్రవారం మర్యాదపూర్వక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు పూలు, కీచైన్ అందజేశారు. సూపర్‌వైజర్ భారతి మాట్లాడుతూ ప్రయాణికుడి కుటుంబ సభ్యుడిగా భావించి గౌరవం, సౌకర్యాన్ని కాపాడే దినంగా ప్రతి ఉద్యోగి కట్టుబాటుతో పని చేయాలని పిలుపున్చిరు.

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే

ఆసిఫాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని జన్కాపూర్, బజార్‌వాడీ, రాజంపేట, దస్నాపూర్ చార్చిలలో పాస్టర్లు గుడ్ ఫ్రైడే వేడుకలను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

యువతకు అవగాహన

కెరమెరి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్మాపూర్, కరంజీవాడ గ్రామల్లో శుక్రవారం ఉట్నూర్ ఎస్‌బీఐ ఆధ్వర్యంలో యువతకు స్వయం ఉపాధి శిక్షణపై అవగాహన కల్పించారు. శిక్షకుడు మల్లయ్య మాట్లాడుతూ కుట్టు మిషన్, మగ్గం వర్క్, బ్యూటీ పార్లర్, హౌస్ వైరింగ్‌లో శిక్షణ ఉంటుందని తెలిపారు.

విద్యార్థులు సాంకేతికతను అందిపుచ్చుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్‌వో మధుకర్

ఆసిఫాబాద్‌రూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాలనుగుణంగా విద్యార్థులు నూతన సాంకేతికతను అందిపుచ్చుకోవాలని డీఎస్‌వో మధుకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక సరస్వతీ శిశు మందిర్ ఆవరణలో అటల్ టింకరింగ్ ల్యాబ్ ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు నిర్వహించే కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు సైన్స్ అండ్ టెక్నాలజీలో ముందుకు వెళ్లాలని, మన చుట్టు ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కార మార్గాలు అన్వేషించాలని చెప్పారు. దీనికి గాను ప్రతి ఒక్కరు టీం వర్క్ చేయాలని సూచించారు. ఎంఈవో సుభాష్ మా ట్లాడుతూ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలో సమ్మర్ క్యాంపుకు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులను ఆహ్వానించడం ద్వారా కమ్యూనిటీ డెవలప్‌మెంట్ అవుతుందన్నారు. కార్యక్రమంలో ఏడు పాఠశాలల నుంచి 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు వెంకటేశ్వర్, కార్యదర్శి వేణుగోపాల్, శ్రీనివాస్, మధుకర్, శ్రీనివాస్, శ్రీనాథ్, స్వాతి, సాయికృష్ణ, రాజశేఖర్, ట్రస్మ జిల్లా అధ్యక్షుడు దేవభూషణం, రాదాకృష్ణచారి, ల్యాబ్ ఇన్‌చార్జి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల హక్కులు కాపాడుతాం



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులు కాపాడుతామని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లికార్జున్ అన్నారు. శుక్రవారం కాగజ్‌నగర్ విశ్రాంత ఉద్యోగు భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్పీఎం ఎన్నికల్లో సీఐటీయూ అనుబంధ సంఘమైన సిర్పూరు పేపర్ మిల్లు మజ్దూర్ యూనియన్(రిజిస్టర్ నంబరు 2510)ని ఆదరించాలని కోరారు. 2013లో చివరి సారిగా ఎన్నికలు జరిగినట్టు తెలిపారు. షెడ్ డౌన్ పేరిట మిల్లును మూత వేసినట్టు, 2014లో మిల్లు పునఃప్రారంభమైనట్టు చెప్పారు. తమ సంఘం పోరాటాల వల్లనే ఇప్పుడు ఎన్నికల అధికారిని నియమించిందన్నారు. త్వరలోనే ఎన్నికలు వస్తాయన్నారు. ఎస్పీఎం క్రెడిట్ సొసైటీ డబ్బులు కూడా సభ్యులకు ఇవ్వడం లేదన్నారు. మిల్లులో కార్మికులకు క్యాంటిన్ సౌకర్యం కూడా లేదన్నారు. కార్మికుల హక్కును కాపాడేది కేవలం సీఐటీయూ మాత్రమే అని తెలిపారు. సమావేశంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, కూశన్న రాజన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్, యూనియన్ నాయకులు శ్రీనివాస్, నీలి రాజన్న పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ రైల్వే స్టేషన్‌లో శుక్రవారం జీఆర్పీఎఫ్ సిఐ ఎస్. సురేష్ బాబు ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఆగి ఉన్న రైళ్లలో ప్రయాణికుల వద్ద పలు బ్యాగులు, అలాగే రైల్వే స్టేషన్‌లోని బుకింగ్ సెంటర్‌ను క్షుణ్ణంగా పరిశీలించారు. వేసవికాలంలో అగ్ని ప్రమాదాలు జరుగకుండా ఉండేందుకు కిరోసిన్, పెట్రోలు, వంట గ్యాస్ పోయ్యిలు తరలించరాదని సూచించారు. అధికారుల సూచనలు పాటించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఎస్సై దాసు, సిబ్బంది పాల్గొన్నారు.

మహారాష్ట్రలో రోడ్డు ప్రమాదం..
కాగజ్‌నగర్ మండల వాసి మృతి

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కాగజ్‌నగర్ మండలం విలేజీ నంబరు 10కి చెందిన విశాల్(18) అనే వ్యక్తి మృతి చెందారు. శుక్రవారం విశాల్ మృత దేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. బీఆర్ఎస్ పార్టీ సిర్పూరు నియోజకవర్గ కన్వీనర్ లెండుగురే శ్యాంరావు, కాశిపాక రాజు, అనూప్, మిథున్, భవితోష్, విశాల్ నివాళులర్పించారు. అలాగే బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ విశాల్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

PUBLIC NOTICE

The General Public is hereby informed that our Clinet Shriram finance Limited. Kagaznagar Branch, Komuram bheem Asifabad Dist. is Dealing with financing business in the Course of business Sri. Gudepu Gopi Krishna S/o. Gudepu vasanth Rao age: 46 yrs, Occupation Business promises No. 1-13-39 kapu wada, kagaznagar locality, Kagaznagar komuram bheem Asifabad District.
property situated At village kagaznagar within the limits of municipality kagaznagar Revenue mandal Kagaznagar Dist Komurambheem (Asifabad), word No 13, Survey Numbers 16/u & 8/u plot No.7, House No. No 1-13-38,39, RCC Ground floor plinth area RCC First floor plinth area 1202.79 Square Feets, and Rcc First Floor Plinth area 1202.79 square feets, Extent of site 60x30= 1800 Square Feets Equvaling to 200 square yards or 167.22 square meters, Registration District Adilabad sub-District Asifabad having the following the boundaries. East: Plot of Bakkaiah, West: Municipal Road, North: House of venkata Laxmi, South: Plot of Gopi Krishna towords security for the loan availed by her if any person or Persons having any Claim, right, title or interest in the above said Property may approach the undersigned within 5 days from the date of this publication or else our clinet will proceed with the transaction.
ఇట్లు సం/- పిన్నింటి అశోక్, అడ్వకేట్
3-7-852/1, వావిలాలపల్లి, కరీంనగర్.
సెల్ : 9849331558


పదోన్నతులకు పరీక్షలు

రెబ్బెన, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓసీ వద్ద బెల్లంపల్లి రీజియన్(శ్రీరాంపూర్, బెల్లంపల్లి, మందమర్రి) పరిధిలోని ఈపీ ఆపరేటర్లకు పదోన్నతుల కోసం ప్రాక్టికల్ పరీక్షలను శుక్రవారం నిర్వహించారు. ఈపీ ఆపరేటర్లు బీ గ్రేడ్ నుంచి ఏ గ్రేడ్ కోసం 30 మంది పరీక్షలకు హాజరయ్యారు.

డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాదం

రెబ్బెన, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గోలేటి టౌన్‌షిప్‌లోని డంపింగ్ యార్డులో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న ఎస్సై చంద్రశేఖర్ అగ్ని మాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది ఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు.

యువత వ్యసనాల బారిన పడొద్దు



అక్షరాలు దిద్దిస్తున్న ఉపాధ్యాయుడు రమేశ్

బెజ్జూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యువత వ్యసనాల బారిన పడొద్దు కాగజ్‌నగర్ మండలం చారిగాంకు చెందిన రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు సుందిళ్ల రమేశ్ అన్నారు. బెజ్జూరు మండలంలోని తలాయి గ్రామంలో అందరు చదవాలి... అందరు ఎదగాలి అనే కార్యక్రమాన్ని శుక్రవారం చేపట్టారు. ఆదివాసీల్లో అక్షర దీపాలు వెలిగించాలన్న ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. యువత మద్య, మత్తు పదార్థాలకు బానిసైతే కలిగే అనర్థాలను వివరించారు. గ్రామాల్లో పిల్లలు తప్పని సరిగా పాఠశాలలకు పంపించాలన్నారు. అనంతరం పిల్లలకు, మహిళలకు విద్యా సామగి అందజేసి అక్షరాలను దిద్దించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్, అంగన్‌వాడీ టీచర్ యశోద, నాయకులు ఇస్తారి, హనుమంతు, లచ్చయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

సదా మీ సేవలో ఆంధ్రజ్యోతి
అ చిరకాలంలోనే అశేష ప్రజాదరణ చూరగొన్న ఆంధ్రజ్యోతికి
చందాదారులు గా చేరాలనుకుంటున్నారా!
అయితే దిగువ పేర్కొన్న ఫోన్ నెంబర్లకు ఫోన్ చేసి చెపితె చాలు
మా సిబ్బంది తక్షణం వచ్చి మీకు పత్రిక అందే ఏర్పాటు చేస్తారు.
పత్రిక పంపిణిలో మీకు ఏమైనా అసౌకర్యం
ఎదుర్కొంటున్న యెడల నిస్సంకోచంగా ఫోన్ చేసి చెప్పవచ్చు
మా సిబ్బంది సదా మీ సేవకు సిద్ధంగా ఉంటారు
మంచిర్యాల : 94929 68431
బెల్లంపల్లి : 77806 58811
కుమ్రంభీం ఆసిఫాబాద్ : 84639 54674
C.O : 99854 11276
ఇట్లు : బ్రాంచ్ మేనేజర్

గుండెపోటుతో హెడ్‌కానిస్టేబుల్ మృతి

కాసిపేట, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమగూడెంకు చెందిన హెడ్‌కానిస్టేబుల్ బొమ్మకంటి ధరమ్‌పాల్ (48) శుక్రవారం తెల్లవారుజామున గుండె పోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లాలో పీసీఆర్ కంట్రోల్ రూంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం విధులకు హాజరయ్యేందుకు తయారవుతుండగా బాత్‌రూంకు వెళ్లి వచ్చి మళ్లీ పడుకున్నాడు. భార్య శిరీష నిద్రలేపే ప్రయత్నం చేయగా కదలిక లేకుండా పడి ఉన్నాడు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు వెంటనే మంచిర్యాల ప్రవేటు ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య శిరీషా కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో ఎస్‌ఐగా పని చేస్తుంది. ధరమ్‌పాల్ 2001 వ బ్యాచ్‌కు చెందినవాడు. స్వస్థలం ఆదిలాబాద్. ఎక్కువకాలం మంచిర్యాల జిల్లాలోనే పోలీసు సేవలు అందించాడు. సోమగూడెం స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నాడు. శుక్రవారం కుటుంబసభ్యులు, స్నేహితులు, బంధువుల సమక్షంలో సోమగూడెంలో అంత్యక్రియలు నిర్వహించారు.

బాలిక అప్పగింత

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో కిడ్నాప్‌నకు గురైన బాలికను శుక్రవారం తల్లికి అప్పగించామని ఆర్పీఎఫ్ సీఐ సురేష్ తెలిపారు. ఈ నెల 15న కొత్తూరు పోలీస్ స్టేషన్‌లో బాలిక కిడ్నాప్‌నకు గురైందని కేసు నమోదైంది. ముందస్తు అందిన సమాచారం మేరకు రెండు రోజుల క్రితం బిహార్‌కు వెళ్లుతున్న రక్సల్ ఎక్స్‌ప్రెస్‌లో వివేక్ సింగ్, బాలికను పట్టుకున్నట్లు వివరించారు. వివేక్‌సింగ్‌ను గురువారం అరెస్టు చేశారు. బాలికను ఆసిఫాబాద్ సఖి కేంద్రానికి తరలించారు. ఈ మేరకు శుక్రవారం ఉదయం బాలికను తల్లికి అప్పగించామని, కిడ్నాప్‌నక్ పాల్పడిన వివేక్‌సింగ్‌ను కొత్తూరు పోలీసులకు అప్పగించామని తెలిపారు.

మహిళల భద్రతకు భరోసా

- ప్రయాణంలో తోడుగా..ఉపయుక్తంగా
- ఆకతాయిల వేధింపులకు చెక్

వాంకిడి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మహిళలకు ప్రయాణ సమయంలో ఎదురయ్యే ఇబ్బందుల నుంచి రక్షణగా ఉండేందుకు తెలంగాణ పోలీసుశాఖ మహిళల భద్రతకు కోసం టీ(ట్రావెల్)- సేఫ్ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఏదైనా ప్రమా దంలో ఉన్న యువతులు, మహిళలు వెంటనే యాప్‌ను ఉపయోగించుకొని సురక్షితంగా ఇంటికి చేరుకునే భరోసాను పోలీసులు కల్పిస్తున్నారు. ఇప్పటికే అతివల భద్రతకోసం అనేక మొబైల్‌యాప్‌లను ప్రవేశపెట్టిన పోలీసు శాఖ తాజాగా టీ-సేఫ్ యా ప్‌ను అందుబాటులోకి తీసుకవచ్చింది. గత ఏడాది మార్చి 12న దీన్ని ప్రారంభించినా సరైన అవగాహన లేక వినియోగించే వారి సంఖ్య తక్కువగానే ఉంది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. చాలా మందికి ఈ యాప్ వినియోగంపై అవగాహన లేదు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో దీనిపై విస్తృత ప్రచారం చేపట్టడం ద్వారా అబలకు పూర్తి స్థాయిలో భరోసా లభించే అవకాశం ఉంది.

విస్తృత ప్రచారం అవసరం

తెలంగాణ రాష్ట్రంలో ఎక్కడైన వినియోగించుకునే ఈ యాప్‌పై విస్తృత ప్రచారం అవ సరం ఉంది. నేటికాలంలో యువతులు, విద్యార్థినులు, మహిళలు ఎక్కడికి వెళ్లినా ఏదో రకమైన ప్రమాదం పొంచి ఉంటుంది. ఒంటరిగా ప్రయాణం సమయంలో విద్యా సంస్థలకు వెళ్లే ప్రాంతాల్లో వేధింపులు, అఘాయిత్యాలు జరిగే అవకాశం ఉంటుంది. వీరికోసం పోలీసు శాఖ ఎంతో పకడ్బందీగా రూపొందించిన టీ-సేఫ్ యాప్ రక్షణగా నిలవనుంది. యాప్‌ను డౌన్‌లోడ్ చేపుకొని ఒంటరిగా వెళ్లే సమయంలో తమ వివరాలు యాప్‌లో నమోదు చేసుకొని ప్రయాణం చేస్తే చాలు పూర్తి సమాచారం పోలీసు శాఖ ఆధీనంలోకి వెళుతుంది. నిర్ధేశిత సమయం తరువాత స్పందన లేని పక్షంలో వెంటనే అప్రమత్తమయ్యే పోలీసులు మొబైల్ నంబర్ ఆధారంగా ట్రాకింగ్ చేసి వారు ఉన్న ప్రాం తాన్ని తెలుసుకుని రక్షించే వీలుంది. జిల్లాలో వివిధ రకాలుగా మహిళలు, విద్యార్థినులు, యువతులు ఎదు ర్కుం టున్న వేధింపుల కేసులు అనేక ఉన్నాయి.

మహిళలు సురక్షితంగా చేరుకునేలా.. సత్యనారాయణ, సీఐ





మహిళలు సురక్షితంగా గమ్య స్థానాలకు చేరుకోవడమే లక్ష్యంగా పోలీసు శాఖ టీ-సేఫ్ యాప్‌ను రూపొందించింది. మహిళలు, యువతులు, విద్యార్థినులు ఈ యాప్‌ను వినియోగించుకోవాలి. ఆపదలో ఉన్న వారు ఈ యాప్ ద్వారా సురక్షితంగా బయటపడవచ్చు. ఈ యాప్‌పై విస్తృత ప్రచారం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

డౌన్‌లోడ్ ఇలా..

పోలీసు శాఖ రూపొందించిన టీ-సేఫ్ యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఆ తర్వాత ఫోన్ నంబర్‌తో లాగిన్ కావాలి. తరువాత హెల్ప్ సిటిజన్ విభాగంలో క్లిక్ చేసి వెళ్లే ప్రాంతం, ప్రయాణించే వాహనం, రిజిస్ట్రేషన్ నంబరు నమోదు చేయాలి. ఒక వేళ రైలులో అయితే దాని నంబరు నమోదు చేయాలి. అనంతరం స్మార్ట్ బటన్ నొక్కగానే పోలీసుల పర్యవేక్షణ మొదలవుతుంది. ఒక్కసారి వాహనం ప్రరంభం కాగానే పోలీసులు మీ లోకేషన్‌ను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు.

బదులివ్వకుంటే

వెళ్లే వాహనం దారిమళ్లినా, పోలీసులు ప్రతీ ఐదు నిమిషాలకు ఓసారి పంపించే హెచ్చరిక సందేశానికి బదులు ఇవ్వకున్నా అనుమానాస్పదంగా పరిగణిస్తారు. ఎక్కువ సమయం స్పందించకపోతే డయల్ 100కు నేరుగా సమాచారం వెళ్తుంది. లోకేషన్ ఆధారంగా సమీపంలోని పోలీసుస్టేషన్ లేదంటే పెట్రోలింగ్ వాహనానికి సమాచారం ఇస్తారు. వెంటనే సిబ్బంది అక్కడికి చేరుకొని పరిశీలిస్తారు. పరిస్థితిని గమనించి అవసరమైన సాయం చేస్తారు. ఇబ్బందుల్లో ఉంటే చర్యలు చేపడతారు. ఒంటరిగా ప్రయాణించే మహిళలు, అమ్మాయిలు, యువతులకు ఇది రక్షణ కవచంలా పనిచేస్తుంది.

పశుగణన ప్రక్రియ కొనసాగుతోంది

మురళీకృష్ణ, పశువైద్యాధికారి



ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: జిల్లాలో పశుగణన ప్రక్రియ కొనసాగుతోందా?

పశువైద్యాధికారి: ప్రస్తుతం అఖిల భారత పశుగణన సర్వే కొనసాగుతోంది. సర్వే అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటాం

ఆంధ్రజ్యోతి: పశువులకు గాలికుంటు వ్యాధి టీకా ఎప్పటి నుంచి ప్రారంభిస్తారు?

పశువైద్యాధికారి: మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాను త్వరలోనే ప్రారంభిస్తాం. ఉన్నతాధికారుల సూచన మేరకు ఏర్పాట్లు చేస్తాం.

ఆంధ్రజ్యోతి: గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయా?

పశువైద్యాధికారి: ఈ ఏడాది ప్రభుత్వం నుంచి సరఫరా కాలేదు. అనుమతులు వస్తే రైతులకు అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా చర్యలు తీసుకుంటాం.

ఆంధ్రజ్యోతి: వ్యాధుల బారిన పడిన పశువులకు చికిత్స అందించేందుకు మందులు అందుబాటులో ఉన్నాయా?

పశువైద్యాధికారి: వ్యాధుల బారిన పడిన పశువులకు సంబంధించిన మందులు అం దుబాటులో ఉన్నాయి. దీని కోసం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నాం.

- ఆసిఫాబాద్‌రూరల్, ఆంధ్రజ్యోతి

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

దండేపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్యంపేట బస్టాండ్ సమీ పంలో గురువారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి తీవ్ర గాయలయ్యాయి. జన్నారం నుంచి కోళ్ల సప్లయ్ చేసే బొలెరో వాహనం ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొట్టడంతో ఆటో డ్రైవర్ కొట్టె చంద్రయ్య (49) అక్కడిక్కడే మృతి చెందాడు. ఆటోలో ప్రయాణిస్తున్న కిలిశెట్టి రాజు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్సై తహసినోద్దీన్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కోర్విచెల్మ గ్రామానికి చెందిన కొట్టె చంద్రయ్య తన ఆటోలో గురువారం రాత్రి లక్షెట్టిపేట నుంచి ఒక ప్యాసెం జర్‌ను ఎక్కించుకుని కోర్విచెల్మకు వస్తున్నాడు. ఈక్రమంలో ము త్యంపేట బస్టాండ్ సమీపంలో జన్నారం నుంచి లక్షెట్టిపేట వైపు వస్తున్న కోళ్ల సప్ల య్‌తో వస్తున్న బొలెరో వాహనం ఆటోను వేగంగా ఢీకొట్టడంతో అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ చంద్రయ్యకు తలకు తీవ్ర గాయాలై అక్క డికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలం ల క్కారం గ్రామానికి చెందిన రాజు తన అత్తగారింటికి కోర్విచెల్మకు వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదాగినికి గురై తీవ్ర గాయాలపాలయ్యాడు. అతడిని స్థానికులు ఆసుపత్రికి తరలిం చారు. చంద్రయ్య మృతదేహాన్ని లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈప్రమాదానికి కారణమైన బొలెరో వాహన డ్రైవర్ జన్నారం మండలం రోటిగూడకు చెందిన ఒడ్డెటి మహేష్‌గా గుర్తించారు. మృతుడి తల్లి కొట్టె భుచ్చవ్వ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వెల్లడించారు.



చంద్రయ్య(ఫైల్)

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

- అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన పోలీసులు

లింగాపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఓ బాలిక మృతిపై అనుమానాలు తలెత్తడంతో పోలీసులు ఇన్‌చార్జి తహసీల్దార్ ఉదయ్‌కుమార్ సమక్షం లో ఖననం చేసిన మృతదేహాన్ని శుక్రవారం వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. కుమరం భీం జిల్లా లింగాపూర్ మండలం కీమానాయక్ తండాకు చెందిన జేవురునాయక్, పంచిబాయి దంపతుల కూతురు సంగీత(16) అనే బాలిక తల్లి మందలించిందని ఈ నెల 11న పురుగుల మందు తాగింది. కుటుంబసభ్యులు ఆదిలాబాద్‌లోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందింది. కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా గురువారం గ్రామంలో ఖన నం చేశారు. విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులకు తెలిసింది. దీంతో ఎస్సై గంగన్న శుక్రవారం లింగాపూర్ ఇన్‌చార్జి తహసీ ల్దార్ ఉదయ్‌కుమార్ సమక్షంలో ఖననం చేసిన మృతదేహాన్ని శుక్రవారం వెలికి తీశారు. అక్కడే పంచనామా నిర్వహించి పోస్టుమార్టం చేశారు. అనంతరం మృతదేహాన్ని పూడ్చివేశారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై గంగన్న తెలిపారు.



సంగీత(ఫైల్)

నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత

కాగజ్‌నగర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అందవెల్లిలో నకిలీ పత్తి విత్తనాలు శుక్రవారం టాస్క్‌ఫోర్సు పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని అందవెల్లి గ్రామానికి చెందిన ఎస్‌మహేందర్ ఇంట్లో తనిఖీ చేయగా, 100 కిలోల బీటీ పత్తి విత్తనాలు పట్టుబడ్డాయని సీఐ రాణా ప్రతాప్ తెలిపారు. వీటి విలువ రూ.3.50లక్షలు ఉంటుందని వివరించారు. భీమిని మండలం పెద్దపేట గ్రామంలో కె సల్మాన్ నుంచి కొనుగోలు చేసినట్టు విచారణలో వెల్లడైందని తెలిపారు.

వక్ఫ్ చట్ట సవరణ బిల్లును వెనక్కి తీసుకోవాలి

ఆసిఫాబాద్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌చట్టం సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ముస్లింలు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాల మేరకు శుక్రవారం ఆసిఫాబాద్ పట్టణంలో ముస్లింలు జామ మసీద్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు నల్ల రిబ్బెనలు ధరించి నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం మసీద్ ఇమామ్‌లు మౌలానా అయాజ్ అష్రఫీ, హఫీజ్ తహేర్ హష్మీలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి విరుద్ధంగా బిల్లు సవరణ చేసిందన్నారు. వక్ఫ్ చట్టం సవరణ ద్వారా కేంద్ర వక్ఫ్ కౌన్సిలర్ రాష్ట్ర వక్ఫ్ సంస్థల స్వయంప్రతిపత్తిని దెబ్బ తీస్తుందని అభిప్రాయ పడ్డారు. రాజ్యాంగానికి విరుద్ధంగా ఉన్న వక్ఫ్ చట్ట సవరణ బిల్లును కేంద్రంలో వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు ఉధృతం చేస్తామని పలువురుహెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు ఫయాజ్, అబ్దుల్లా, అమన్, ఉబేద్‌బిన్ యాహియా, అబ్దుల్ రహెమాన్, రాఫీక్ అహ్మద్, తాజ్, ఇమ్రాన్, ఇమ్రాన్ హష్మి, ఆసీఫ్, జమీర్ తదితరులు పాల్గొన్నారు. కాగా ర్యాలీకి కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎంపీపీ బాలేష్‌గౌడ్, నాయకులు మల్లేష్, రాజు, తదితరులు మద్దతు తెలిపారు.

మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు

కోటపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంచపల్లి, నక్కలపల్లి, పంగిడి సోమారం గ్రామాల్లో శుక్రవారం ఉదయం కల్లా మావోయిస్టులకు వ్యతిరేకంగా పోస్టర్లు వెలిశాయి. ఆదివాసీ యువజన సంఘం పేరిట ఈ పోస్టర్లు వెలువగా ఆదివాసీల మీద మావోయిస్టుల అప్రకటిత యుద్ధం ఏమిటని కర్రె గుట్టల్లో మందు పాతరలు మావోయిస్టులారా తీరవా మీ రక్త దాహాలు అనే పోస్టర్లతో పాటు అడవుల్లో మందు పాతరలు, ఆదివాసీలను అడ్డుకుంటున్న మావోయిస్టులు అనే పోస్టర్లు గ్రామాల్లోని పలు కూడళ్లలో వెలిశాయి. ఈ పోస్టర్లలో మావోయిస్టులారా నిత్యం ఆదివాసీ ప్రజలపై ఆధారపడి బతికే మీరు అడవులే ఆధారంగా జీవనం పొందుతున్న ఆదివాసీలను అడవుల్లోకి రావద్దని చెప్పే అధికారం మీకు ఎవరిచ్చారని పోస్టర్లలో ప్రకటించారు. ఇటీవల వెంకటాపురం వాజేడు ఏరి యా కమిటీ కార్యదర్శి శాంత పేరుతో వెంకటాపురం, వాజేడు మండలాల్లోని ఆదివాసీ ప్రజలను తీవ్ర భయ బ్రాంతులకుగురి చేస్తూ మావోయిస్టు పత్రిక ప్రకటన విడుదల చేసింది. ఆపరేషన్ కగార్ దాడి నుంచి రక్షణ పొందడానికి కర్రె గుట్టలపై బాంబులు పెట్టామని అటు వైపు వేటకు, తునికాకు సేకరణకు, ఇతర అటవీ ఉత్పత్తుల కోసం ఆదివాసీలు ఎవరు వెళ్లకూడదంటూ ప్రజలకు మావోయిస్టులు హుకుం జారీ చేసిన నేపథ్యంలో ఆదివాసీ సంఘాల పేరిట ఈ పోస్టర్లు వెలువడడం కలకలం సృష్టించింది. మేం అడవుల్లోకి వెళ్లకుండా ఇంకెక్కడికి వెళ్లాలి, తమను బతకనివ్వరా, మా ప్రాంతాలపై మీ పెత్తనం ఏమిటని, అడవుల్లో విచ్చల విడిగా మందు పాత రలు పెడితే ఆదివాసీలు బతికేది ఎలాగా, ఇదే నా మీ సిద్దాంతం, ఇందు కోసమేనా మీ ఉద్యమం ఉంటూ ఆదివాసీ యువజన సంఘం తెలంగాణ రాష్ట్రం పేరిట పోస్టర్లు వెలిశాయి.



మావోయిస్టులకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లు

గంజాయి తీసుకుంటున్న ముగ్గురి అరెస్టు

జైపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేలాల గ్రామంలోని ఇసుక క్వారీ వద్ద గంజాయి తీసుకుంటున్న ముగ్గురు వ్యక్తులను అరెస్టు చేశామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం ఏసీపీ కార్యాలయంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్‌తో కలిసి వివరాలను వెల్లడించారు. ఏసీపీ మా ట్లాడుతూ వేలాల, కిష్టాపూర్ గ్రామాలకు చెందిన దుర్గం సాయికార్తీక్, సుందిల్ల సంపత్, ప్యాగ శేఖర్‌లు వారి బైక్‌లపై ఆసిఫాబాద్‌కు వెళ్లి అక్కడ గుర్తు తెలియని వ్యక్తుల వద్ద నుంచి గంజాయి కొనుక్కుని వచ్చి కొంత వీరు సేవిస్తూ మిగిలిన గంజాయిని చిన్నచిన్న ప్యాకెట్లు చేసి అమ్ముతున్నారన్నారు. ఒక్క ప్యాకెట్ రూ. 500 చొప్పున అమ్ముతూ వచ్చిన డబ్బులతో జల్సాలు చేస్తున్నారన్నారు. వారం రోజుల క్రితం ఆసిఫాబాద్‌కు వెళ్లి 500 గ్రాముల గంజాయిని రూ. 5 వేలకు కొనుగోలు చేసి ప్యాకెట్లు చేసి అమ్ముతున్నారన్నారు. మిగిలిన గంజాయిని సుందిల్ల సంపత్ వద్ద ఉంచగా శుక్రవారం గంజాయిని అమ్ముదామని వచ్చి వేలాల లోని ఇసుక క్వారీ వద్ద ఉండగా పోలీసులు పట్టుకున్నారన్నారు. సుందిల్ల సంపత్ వద్ద ఉన్న 290 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌ను, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. గంజాయి సేవిస్తున్న వ్యక్తులను పట్టుకున్న జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్, అదనపు ఎస్‌ఐ రామలక్ష్మీలను ఏసీపీ అభినందించారు.



కార్మికులకు హక్కులు సాధించి పెట్టాం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కార్మికులకు అనేక హక్కులు సాధించి పెట్టామని ఏఐటీయూసీ బ్రాంచ్ కార్యదర్శి సలేంద్ర సత్యనారాయణ అన్నారు. శుక్రవారం స్దానిక కేకే 5 గని వద్ద ఆయన మాట్లాడారు. కార్మికులకు ఏమి చేయని సంఘాలు తమ యూనియన్‌ను విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. సింగరేణి సీఎండీతో పాటు డైరెక్టర్లతో జరిగిన నిర్ణయాత్మక స్ట్రక్చర్ సమావేశంలో పలు కీలక ఒప్పందాలు చేసుకున్నామని చెప్పారు. కార్మికులకు సొంతింటి పథకం అమలుతో పాటు కార్మికుల మారుపేర్ల మార్పు ఉన్నాయని తెలిపారు. సమావేశంలో భీమనాధుని సుదర్శన్, కంది శ్రీనివాస్, గాండ్ల సంపత్ పాల్గొన్నారు.

టీబీజీకేఎస్ ఆర్‌కే-5 పిట్ కమిటీ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం (టీబీజీకేఎస్) ఆర్‌కే-5 పిట్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నారు. గనిపై నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిధులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. సురేందర్‌రెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు పెట్టం లక్ష్మణ్ హాజరయ్యారు. వారి సమక్షంలో పిట్ కార్యదర్శిగా దుర్గం రవికుమార్, సహాయ కార్యదర్శిగా పాపిరెడ్డి, కార్యనిర్వహణ కార్యదర్శిగా జాడి శ్రీనివాస్, షిఫ్ట్ కార్యదర్శులుగా రమేష్, మల్లేష్, సెగ్గం వెంకటేశ్, ఇండ్ల భూమ్‌రాజ్ ఎన్నికయ్యారు.

భద్రతతో కూడిన విద్యుత్ ఉత్పత్తి చేయాలి

జైపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో భద్రతతో కూడిన విద్యుత్ ఉత్పత్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ ఆఫ్ ప్యాక్టరీస్ గోపాల్‌రావు, సింగరేణి డైరెక్టర్ ఈఅండ్‌ఎం సత్యనారాయణరావులు అన్నారు. ఎస్టీపీపీ లోని ఆడిటోరియంలో 54వ జాతీయ భద్రత వారోత్స వాల ముగింపు వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వ హించారు. జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ భద్రతకు సంబంధించి అన్ని రక్షణ చర్యలు పాటించాలని, రక్షణ చర్యలు పాటించకపోతే ప్రమాదాలు జరుగుతాయన్నారు. ఒక ప్రమాదం వల్ల జరిగే ప్రాణ, ఆస్తినష్టాలను పూడ్చలేని వన్నారు. మనం చేసే పని సురక్షితమైందా కాదా అని తెలుసుకుని పని చేయాలన్నారు. ప్రమాదాల నివారణకు సింగరేణి సంస్థ అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు. ప్లాంట్‌లో అన్ని రకాల భద్రత నియమాలు పాటిస్తున్నామన్నారు. ఈ సందర్భం గా సీనియర్ అసిస్టెంట్ విజయ్‌కుమార్ భద్రతపై పాటలు పాడి అలరించారు. పవర్‌మేక్ కంపెనీ ఉద్యోగు లు భద్రతపై ప్రదర్శన నిర్వహించారు. సేఫ్టీ స్లోగన్, సేఫ్టీ డ్రాయింగ్, ఎస్సే రైటింగ్ పోటీల్లో గెలుపొందిన ఉద్యోగులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, అధికారులు శ్రీనివాసులు, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ సత్యనారాయణ, సముద్రాల శ్రీనివాస్, అఖిల్ కపూర్, తుకారాం తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సింగరేణి డైరెక్టర్లు

కనీస పింఛన్ రూ. ఐదు వేలకు పెంచాలి

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి) : బొగ్గు గనుల్లో పనిచేస్తూ రిటైర్ అయ్యే ఉద్యోగుల కనీస పింఛన్‌ను ఐదు వేల రూపాయలకు పెంచాలని బీఎంఎస్ బొగ్గు గనుల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు సభ్యుడు కొత్తకాపు లక్ష్మారెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో సీఎంపీఎఫ్ ట్రస్ట్ బోర్డు చైర్మన్ విక్రమ్ దేవ్ దత్ అధ్యక్షతన శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం ఇచ్చే పింఛన్ రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలను పోషించుకునేందుకు ఏమాత్రం సరిపోవడం లేదన్నారు. వృద్ధాప్య అనారోగ్య సమస్యలు వారిని మరింత ఆర్థిక ఇబ్బందుల్లోకి నెడుతున్నాయని తెలిపారు. ఎఫ్‌పీఎస్-1971 చట్టం ప్రకారం అప్పటి పింఛన్‌దారులకు అతి తక్కువ పింఛన్ వస్తోందని, వారికి కనీసం రూ. 1000లు ఇవ్వాలని కోరారు. ఈ విషయంపై పరిశీలిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్(ఈటీఎఫ్)లో పెట్టుబ డుల శాతాన్ని 7 శాతం నుంచి 10 శాతం వరకు పెంచేందుకు నిర్ణయం తీసుకోవాలని, సీఎంపీఎఫ్ ప్రధాన కార్యాలయంలో పెట్టుబడుల అజమాయిషీకి తగిన యంత్రాంగం ఉండాలన్నారు. నూటికి నూరు శాతం ఆన్‌లైన్ పద్ధతి అమలయ్యే విధంగా ఉండాలని కోరగా, ఆన్‌లైన్ పద్ధతి అమలును ఈ నెలాఖరు నుంచి అమలు చేస్తామని అధికారులు చెప్పారు. కోల్ ఇండియా నిర్ణయించినట్లు సింగరేణి యాజమాన్యం కూడా ప్రతి టన్ను బొగ్గు అమ్మకం చేసినప్పుడు రూ.20లు పెన్షన్ ఫండ్‌కు జమ చేయాలని బోర్డు సభ్యులు సూచించాని తెలిపారు. దీనికి సింగరేణి సీఎండీ ఎన్. బలరాం అంగీక రించారని లక్ష్మారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సీఎంపీఎఫ్ కమిషనర్ విజయ్ కుమార్ మిశ్రా, అదనపు కార్యదర్శి రూహిదర్ బ్రార్, ఆర్థిక సలహాదారు నిరుపమా కొట్రూ, డీడీజీ సంతోష్, బీఎంఎస్ ప్రతినిధి, ట్రస్ట్‌బోర్డు సభ్యుడు ఆశిష్‌మూర్తి, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్లాంట్ పనులు 40 నెలల్లో పూర్తి చేయాలి

జైపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీలో మూడో యూనిట్‌కు సంబంధించిన పనులను 40 నెలల్లో పూర్తి చేయాలని సింగరేణి డైరెక్టర్ సత్యనారాయణరావు అన్నారు. ఎస్టీపీపీ ప్రాణహిత గెస్ట్ హౌజ్‌లోని కాన్ఫరెన్స్ హాలులో శుక్రవారం మూడో యూనిట్ పనులపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడో యూనిట్‌కు సంబంధించి ప్రిపరేటరీ వర్క్‌ను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, అధికారులు శ్రీనివాసులు, మురళీధర్, మదన్ మోహన్, అజాజులాఖాన్, వేణుగోపాల్‌రావు, లక్ష్మణ్, రాజేష్, శివప్రసాద్, తుకారం తదితరులు పాల్గొన్నారు.

టన్ను బొగ్గు అమ్మకంపై రూ.20 సీఎంపీఎఫ్ ఫండ్‌కు జమ

శ్రీరాంపూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ఉన్న దానికి అదనంగా ప్రతి టన్ను బొగ్గు అమ్మకంపై రూ.20 సీఎంపీఎఫ్ ఫండ్‌కు జమ చేసేందుకు సింగరేణి అంగీకరిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సర్క్యులర్ ఈ నెల 16వ తేదీ నుంచి అమల్లోకి వస్తుందని ఉన్నతాధికారులు పేర్కొన్నారు. కోల్ ఇండియాలో మాదిరిగా సీఎంపీఎఫ్ ఫండ్‌కు ప్రతి టన్ను బొగ్గు అమ్మకంపై అదనంగా డబ్బులు జమ చేయాలని యూనియన్ల నుంచి డిమాండ్ ఉండడంతో యాజమాన్యం అంగీకరించింది.

స్తంభం పైనుంచి పడి ఉద్యోగికి గాయాలు

నెన్నెల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గంగారం గ్రామానికి చెందిన విద్యుత్ శాఖ కాంట్రాక్టు ఉద్యోగి సొలాని చంద్రయ్య శుక్రవారం కరెంటు స్తంభం పైనుంచి కింద పడి గాయాలపాలయ్యాడు. గ్రామస్థులు తెలిపిన ప్రకారం.. కరెంటు స్తంభం పైన మరమ్మతులు చేస్తుండగా అది పైభాగంలో విరిగి పోయింది. పట్టు తప్పిన చంద్రయ్య అక్కడి నుంచి కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని సహచర సిబ్బంది ఆటోలో మంచిర్యాలకు తరలించి ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. పరీక్షించిన వైద్యులు రెండు కాళ్లు విరిగినట్లు నిర్ధారించి చికిత్స అందిస్తున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

వేమనపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నీల్వాయి గ్రామంలో శుక్రవారం మండలంలోని పలువురు లబ్ధిదారులకు మాజీ జడ్పీటీసీ సంతోష్‌కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ సాబీర్ అలీలు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. మండలంలోని 15 మంది లబ్ధిదారులకు రూ. 5.16 లక్షల విలువ చెక్కులను అందించారు. నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదివాసీల భూములను లాక్కుంటున్న అటవీ శాఖ

వేమనపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల భూములను అటవీ శాఖ అక్రమంగా లాక్కుంటుందని సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రాజారం గ్రామంలో ఆదివాసీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజారాంలోని ఆదివాసీలకు 1992లో 80 మందికి ప్రభుత్వం పట్టాలు అందించిందన్నారు. ఐటీడీఏ ద్వారా మామిడి బోర్లు, మామిడి, జీడి మామిడి మొక్కలు నాటడానికి అందించిందని, వ్యవసాయం కోసం ఎద్దులను కూడా మంజూరు చేసిందన్నారు. వెంటనే భూములకు పట్టాలు అందించి గిరిజనులకు న్యాయం చేయాలని, డిమాండ్ చేశారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు రాజన్న, నాయకులు శంకర్, జయ ఉన్నారు.

మార్పు కోరుతూ.. ముందుకెళ్తూ..


బుయ్యారం అటవీ ప్రాంతంలో గుడుంబా బట్టిని ధ్వంసం చేస్తున్న పోలీసులు (ఫైల్)

గుడుంబా నిర్మూలించేందుకు పోలీసుల కృషి

యువకులను చైతన్యపరుస్తూ ర్యాలీలు

వేమనపల్లి, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): వేమనపల్లి మండలంలోని చాలా గ్రామాల్లో గుడుంబా తయారీ కొంత మందికి జీవనాధారం అయ్యింది. కొంత మంది కేవలం గుడుంబా తయారు చేసి విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ముఖ్యంగా మండలంలోని బుయ్యారం, జిల్లెడ, సూరారం, నాగారం, మంగెనపల్లి, మామిడిపల్లి, పక్కన ఉన్న కన్నెపల్లి మండలంలో సైతం పెద్ద మొత్తంలో గుడుంబా తయారవుతుంది. ఒక్కో గ్రామంలో పది నుంచి 15 కుటుంబాలు ఇదే వృత్తిని కొనసాగిస్తున్నాయి. సమీప అడవుల్లో బెల్లం పాకంతో తయారు చేసి ఆ పాకంతో నాటు సారా తయారు చేస్తున్నారు.

బెల్లం, పటిక, అమోనియా, జీడి గింజలతో గుడుంబా తయారు చేస్తున్నారు. గుడుంబా తయారీకి ఎక్కువ మొత్తంలో అమోనియా, పటిక వాడుతుండంతో గుడుంబా తాగిన వారు అనతికాలంలోనే అనారోగ్యాల బారినపడి అర్ధాంతరంగా తనువు చాలిస్తున్నారు. గతంలో తయారు చేసిన గుడుంబాను ఎక్సైజ్ అధికారులు ఎన్నోసార్లు ధ్వంసం చేసి కేసులు నమోదు చేసినా తయారు చేసే వారిలో ఏ మాత్రం మార్పు కనబడడం లేదు.

గుడుంబా నిర్మూలనకు పోలీసుల కృషి

మండలంలో అధిక మొత్తంలో గుడుంబా తయారు కావడం, గుడుంబాను ప్రజలు తాగి అనారోగ్యాల పాలై కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. దీంతో నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ గుడుంబా తయారు చేసి విక్రయిస్తున్న గ్రామాల్లో అక్కడి గ్రామ యువకులతో సమావేశాలు నిర్వహించి గుడుంబా నిర్మూలనకు కృషి చేస్తున్నారు. గుడుంబా తయారు చేసే వారి ఇండ్లకు వెళ్లి వినూత్నంగా వారికి పుష్పగుచ్చాలు అందించి గుడుంబా తయారు చేయవద్దని సూచిస్తున్నారు. గ్రామాల్లో యువకులతో కలిసి ర్యాలీ నిర్వహించి గుడుంబా వల్ల జరిగే అనర్థాలను వివరిస్తున్నారు. ఇప్పటికే మండలంలోని మంగెనపల్లి, సూరారం, మామిడిపల్లి గుడుంబా అమ్ముతున్న వారికి పుష్పగుచ్ఛం అందించి గుడుంబా తయారు చేయడం మానుకోవాలని, ఇతర పనులను చేసుకోవాలని కౌన్సెలింగ్ ఇచ్చారు. గుడుంబా తయారీలో మోతాదుకు మించి విషపూరితమైన పదార్థాలు కలుపుతుండడంతో అది తాగిన వారు అనారోగ్యాల పాలై ఆసుపత్రుల్లో చేరి వారి కుటుంబాలు వీధిన పడుతున్నాయని, గుడుంబా అమ్మకాలను మానుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. గుడుంబాను నిర్మూలించాల్సిన ఎక్సైజ్ అధికారులు సైతం రంగంలోకి దిగి గుడుంబా స్థావరాలపై దాడులు చేస్తే గుడుంబా తయారీని అరికట్ట వచ్చని ప్రజలు పేర్కొంటున్నారు. ఏది ఏమైనా నీల్వాయి పోలీసులు గుడుంబా నిర్మూలన కోసం కృషి చేస్తుండటం అభినందనీయమని స్థానిక ప్రజలు అంటున్నారు.


మామిడిపల్లిలో గుడుంబా నిర్మూలన కోసం యువకులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ శ్యామ్ పటేల్ (ఫైల్)

అనారోగ్యాల బారిన పడతారు

రాజేష్, ప్రభుత్వ వైద్యుడు, వేమనపల్లి

మండలంలోని చాలా గ్రామాల్లోని గిరిజనులు చౌకగా దొరుకుతుందని గుడుంబాను తాగి అనారోగ్యాల బారిన పడుతున్నారు. గుడుంబాలో నిషా వచ్చేందుకు విషపూరితమైన పదార్థాలు కలపడంతో అది తాగిన వారికి కిడ్నీలు, లివర్ త్వరగా పాడైపోయే అవకాశం ఉంటుంది. మృత్యువాత పడే అవకాశాలున్నాయి. మండలంలో చాలా మటుకు నిరుపేద ప్రజలే దీనికి బానిస అవుతున్నారు. గుడుంబా మంచిది కాదు. పోలీసులు గుడుంబా నిర్మూలించేందుకు చేస్తున్న కృషి అభినందనీయం.

గుడుంబా నిర్మూలనే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం

ఎస్ఐ శ్యామ్‌పటేల్, నీల్వాయి

మండలంలోని పలు గ్రామాల్లో అధికంగా గుడుంబా తయారీ అవుతుంది. గుడుంబా తాగిన వారు గ్రామాల్లో గొడవలకు పాల్పడుతున్నారు. గుడుంబాకు బానిసై వారి కుటుంబాలను ఆర్థికంగా నష్టపోతున్నారు. గుడుంబా ను నిర్మూలించేందుకు ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం. గుడుంబా తయారు చేసి విక్రయించే వారి వద్దకు వెళ్లి వారికి పుష్పగుచ్ఛాలు అందించి గుడుంబా తయారు చేయవద్దని, విక్రయించవద్దని కోరుతున్నాం. యువకులు, మేధావులు గుడుంబా నిర్మూలనలో భాగస్వాములు కావాలి. గుడుంబా తయారు చేయడం మానుకోవాలి లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటాం.

కౌలు రైతును ఆదుకునేదెప్పుడో..

(5వ పేజీ తరువాయి)

ఏర్పడ్డ తరువాత చట్టం పూర్తిగా చచ్చుబడి పోయింది. 2016-17 వరకు చట్టాన్ని అమలు చేసిన ప్రభుత్వం ఆ తరువాత దాన్ని పట్టించుకోలేదు. చట్టంలో భాగంగా రెవెన్యూ అధికారులు కౌలు రైతులకు వ్యవసాయ సాగుకోసం గుర్తింపు కార్డులు అందజేసేవారు. గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద రైతుల వివరాలు నమోదై ఉండేవి. కౌలు రైతులకు బ్యాంకు రుణాలు పొందేందుకు అర్హత కార్డులు ఉండేవి. క్రాప్ లోన్ మినహాయించి ఇతరత్రా రుణాలు పొందేందుకు ఇవి ఉపయోగపడేవి. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రుణమాఫీ ప్రకటించి, రైతు బంధు పథకం కింద ఎకరానికి ఏటా రూ. 8వేలు అందించినా.. భూ యజమానికే తప్ప కౌలు రైతులకు ఎలాంటి ప్రయోజనం కలగలేదు. ఈ క్రమంలో రాష్ట్ర సర్కారు స్పందించి, తమనూ రైతు బంధు పథకం పరిధిలోకి తెచ్చి, పెట్టుబడి సాయం అందజేయాలని కౌలు రైతులు విజ్ఞప్తి చేసినా అప్పటి ప్రభుత్వం పట్టించుకోలేదు. అదుకుంటామని భరోసా ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు.

ఆత్మహత్యలే శరణ్యమని...

అధికారుల లెక్కల ప్రకారం జిల్లాలో సుమారు 3వేల మంది కౌలు రైతులు ఉన్నారు. వీరిలో ఇటీవలి బలవంతపు మరణాలకు పాల్పడుతున్న వారి సంఖ్య క్రమేపీ పెరుగుతోంది.

●కోటపల్లి మండలం పుల్లగామకు చెందిన కౌలు రైతు కామ లింగయ్య (51) పత్తి పంట ప్రాణహిత వరదల్లో మునిగి నష్టం వాటిల్లగా 2022 సెప్టెంబరు 20న ఆత్మహత్య చేసుకున్నాడు.

●భీమారం మండలం కొత్తపల్లికి చెందిన దుర్గం శ్రీనివాస్ (27) నాలుగు ఎకరాలను కౌలుకు తీసుకొని పత్తి సాగు చేయగా అధిక వర్షాల కారణంగా దిగుబడి రాక 2022 అక్టోబర్ 27న పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

●తాండూరు మండలం రేపల్లె వాడకు చెందిన పెద్దపల్లి లక్ష్మి (41) అనే కౌలు రైతు భార్య పంట దిగుబడి తగ్గి అదే సంవత్సరం నవంబరు 16న పురుగుల మందు తాగగా 18న మృతి చెందింది. అదే నెల 29న కాసిపేట మండలం కొండాపూర్‌కు చెందిన కొమిరె కనకయ్య (39) పంట దిగుబడి రాక ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

●లక్సెట్టిపేట మండలం చందారంలో పంట దిగుబడి రాక 2022 డిసెంబరు 11న పురుగుల మందు తాగి ఆకుల మల్లయ్య (45) అనే కౌలు రైతు ఆత్మ హత్య చేసుకున్నాడు.

●కన్నెపల్లి మండలం జనకాపూర్‌కు చెందిన కౌలు రైతు మేడి శ్రీనివాస్ (40) అదే నెల 12న తనువు చాలించాడు. ఇటీవల పైతం కౌలు రైతుల మరణాలు ఉండగా, వాటిని సంబంధిత అధికారులు ధృవీకరించాల్సి ఉంది.

మంచంపై నుంచి పడి మృతి

దండేపల్లి, ఏప్రిల్ 18(ఆంధ్రజ్యోతి): లక్సెట్టిపేట అంగడి బజార్‌కు చెందిన ఎస్‌కే నౌసర్ అలీ (45) నిద్రలో మంచంపై నుంచి కిందపడి మృతి చెందినట్లు లక్సెట్టిపేట ఎస్ఐ గోపతి సురేశ్ తెలిపారు. మృతుడు లాభూగా ఉండటంతో ప్రమాదవశాత్తు మంచంపై నుంచి పడిపోయి చనిపోయినట్లు మృతుడి భార్య నుర్జాన్ బేగం ఫిర్యాదు చేయగా లక్సెట్టిపేట ఎస్ఐ-2 రామయ్య కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్ పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

కాసిపేట, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలు, పాలన వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య అన్నారు. శుక్రవారం కాసిపేట మండలం కొండాపూర్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారన్నారు. ఈ నెల 27న హన్మకొండ ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ మహాసభలకు పార్టీ శ్రేణులు, అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సభ వరంగల్ పోస్టర్లను విడుదల చేశారు. బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రమణారెడ్డి, మాజీ జడ్పీటీసీ చంద్రయ్య, మాజీ ఎంపీటీసీలు రాంచందర్, మంజుల రెడ్డి ఉన్నారు.


మాట్లాడుతున్న బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

డబుల్ రోడ్డు నిర్మించాలని గ్రామస్థుల ఆందోళన

భీమిని, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): భీమిని మండల కేంద్రంలో సింగిల్ రోడ్డుకు బదులుగా డబుల్ రోడ్డు నిర్మించాలని శుక్రవారం గ్రామస్థులు రోడ్డుపై బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాండూర్ మండల కేంద్రం నుంచి భీమిని మండలంలోని వడాల గ్రామం వరకు తాండూరు, అచ్చలాపూర్, భీమిని మండలంలోని రాంపూర్, బిట్టూరుపల్లి, వడాల గ్రామాల్లో డబుల్ రోడ్డును నిర్మించిన ఆర్అండ్‌బీ అధికారులు భీమిని మండల కేంద్రంలో సింగిల్ రోడ్డు వేశారని అన్నారు. దీంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. సింగిల్ రోడ్డుగా ఉండటంతో ఎదురుగా వచ్చే వాహనాలు కిందికి దిగకనే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే అధికారులు సింగిల్ రోడ్డుకు బదులుగా డబుల్ రోడ్డు వేయాలని డిమాండ్ చేశారు. ఇదే విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

ఏసీబీ అదుపులో నస్పూర్ ఎస్సై

రికవరీ డబ్బులు ఇవ్వకుండా తిప్పించుకున్నందుకు అధికారుల దాడి


ఎస్ఐ సుగుణాకర్

నస్పూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ ఎస్సై నెర్స్ సుగుణాకర్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఏసీబీ డీఎస్పీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో దాడులు ఇన్‌స్పెక్టర్ నస్పూర్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం తనిఖీలు చేపట్టారు. క్షుద్ర పూజల కేసులో రికవరీ చేసిన రెండు లక్షల రూపాయలను బాధితుడికి ఇవ్వాలని కోర్టు సూచిస్తే వాటిని ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసినందుకు బాధితుడు ప్రభంజన్ ఏసీబీని ఆశ్రయించాడు. దీంతో ఏసీబీ అధికారులు శుక్రవారం దాడులు చేసి ఎస్సై సుగుణాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కేసు వివరాలను ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ వెల్లడించారు. జనవరి 25న నస్పూర్‌లోని హౌసింగ్ బోర్డు కాలనీలో కొందరు క్షుద్ర పూజలు నిర్వహించి డబ్బు సంపాదించవచ్చని ప్రభంజన్‌ను నమ్మించారు. వారు చెప్పినట్లు రూ రెండు లక్షలతో పూజల్లో పాల్గొన్నారు. ప్రభంజన్‌కు మధ్యలో అనుమానం వచ్చి తన డబ్బులను తనకు ఇవ్వాలని అడిగాడు. నిందితులు ప్రభంజన్‌ను బెదిరించి పారిపోయారు. దీంతో బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పలువురిపై కేసు నమోదు చేయడంతో పాటు రెండు లక్షల నగదును పోలీసులు సీజ్ చేశారు. ప్రభంజన్ ఈ నెల నాలుగవ తేదీన కోర్టు నుంచి ఆర్డర్ తీసుకువచ్చి ఎస్సైని కలిసి డబ్బులు ఇవ్వాలని కోరాడు. బాధితుడికి డబ్బులు ఇచ్చే సమయంలో ఫోటోలు, సంతకాలు తీసుకోవాలని కోర్టు సూచించిందని డీఎస్పీ తెలిపారు. డబ్బు ఇవ్వకుండా తిప్పుకోవడంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఎస్సై మాట్లాడిన మాటల ఆడియో రికార్డులు ఏసీబీ అధికారులకు అప్పగించాడు. ఈ నెల 10న డబ్బు చెల్లిస్తానని ఎస్ఐ రమ్మని పిలిచి రూ. 50 వేలు మాత్రమే ఇస్తానని ముట్టజెప్పాడు. మరుసటి రోజు కొంత మొత్తం ఇస్తే ఎస్ఐ లక్ష్మణ ప్రభంజన్‌కు ఇచ్చినట్లు ఫోటోలు తీసుకుని వెళ్లాడని, సంతకం పెట్టమని అడిగితే బాధితుడు నిరాకరించాడు. తిరిగి ఆ డబ్బులను ఎస్ఐ డెస్క్‌లో వేసుకుని బాధితుడిని తిప్పుకుంటున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు అధికారులు శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో తనిఖీలు చేపట్టారు. ఎస్సైపై కేసు నమోదు చేశామని, రిమాండ్‌కు పంపుతున్నామని ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్ తెలిపారు.

బీఆర్ఎస్ సభను విజయవంతం చేయాలి


బొట్టు పెడుతున్న మహిళా నాయకులు

మందమర్రి, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయాలని బీఆర్ఎస్ పార్టీ దాని అనుబంధ సంఘాల నాయకులు మేడిపల్లి సంపత్, సురేందర్, రాజకుమార్ తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రాణహిత కాలనీలో ఇంటింటా తిరుగుతూ ప్రచారం నిర్వహించారు. 7వ వార్డు, 8వ వార్డులో మద్దిశంకర్, కనకం రవీందర్, ఓడెల్లు ప్రచారం నిర్వహించారు.

ప్రభుత్వం ప్రతీ గింజను కొనుగోలు చేస్తుంది

మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్ చందు

దండేపల్లి, ఏప్రిల్ 17 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతుల పంటలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించేందుకే గ్రామాలలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని లక్సెట్టిపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ దాసరి ప్రేమ్‌చందు అన్నారు. దండేపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఎంపీడీ చైర్మన్ మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని నేరుగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలకు తరలించి విక్రయించుకోవాలన్నారు. దళారులకు అమ్ముకొని రైతులు ఎవరు మోసపోవద్దన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేయాలన్నారు. కార్యక్రమంలో దండేపల్లి మాజీ ఎంపీటీసీ ముత్యాలశ్రీనివాస్, ఎఎంసీ డైరెక్టర్ కట్కూరి రాజన్న, బండ రాకేష్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు నిరికొండ నవీన్, మండల సమైక్య అధ్యక్షురాలు అనిత, వివోఏ అనంతలక్ష్మి, గ్రామైక్య సంఘం సభ్యులు, రైతులు, పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

చెన్నూరు: మండలంలోని నారాయణపూర్, వెంకంపేట, పొక్కూరు, బీరెల్లి, దుబ్బపల్లి, ఆస్నాద్, ఒత్కులపల్లి, గంగారం గ్రామాల్లో శుక్రవారం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ చల్లం రాంరెడ్డి మాట్లాడుతూ రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని సూచించారు. మాజీ జడ్పీటీసీ కరుణ సాగర్‌రావు, కాంగ్రెస్ నాయకులు హేమంత్‌రెడ్డి, కేంద్రాల నిర్వహకులు పాల్గొన్నారు.


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేమ్‌చందు

వేతనాలను విడుదల చేయాలి

మందమర్రిరూరల్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): గత నాలుగు నెలలుగా ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు వేతనాలు రాక ఇబ్బందులు పడుతున్నామని, వెంటనే వేతనాలను విడుదల చేయాలని ఫీల్డ్ అసిస్టెంట్ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు ఈద లింగయ్య, మండల అధ్యక్షుడు శెట్టి సత్యనారాయణలు ప్రభుత్వాన్ని ఒక ప్రకటనలో కోరారు. వేతనాలు రాక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని, పస్తులుండే పరిస్థితి వచ్చిందని, వెంటనే ప్రభుత్వం వేతనాలను విడుదల చేయాలని కోరారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

భీమారం, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కుమ్మరివాడకు చెందిన గొళ్లపల్లి మహేశ్ ఇటీవల లారీ ఆక్సిడెంట్‌లో శ్రీధర్మారాజపాలెం చికిత్స పొందుతూ మరణించగా వారి దశదిన కర్మకాండకు సీనియర్ నాయకులు, శ్రీ వెంకటేశ్వర ఎస్సీ వెల్ఫేర్ సొసైటీ చైర్మన్ వేల్పుల శ్రీనివాస్ మృతుని కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులను అందచేశారు. కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న గమనించి వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కృతజ్ఞతలు తెలిపారు. కేతవేని సత్యం, రాజిరెడ్డి, రాజారాం, గోపాలరెడ్డితో పాటు పలువురు ఉన్నారు.

పాలపళ్లు, తునికి పండ్లకు భలే గిరాకీ


మార్కెట్‌లో విక్రయిస్తున్న పండ్లు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): అడవుల్లో లభించే పాలపండ్లు, తునికిపండ్లకు భలే గిరాకీ ఏర్పడింది. శుక్రవారం పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో అడవి నుంచి పాలపండ్లు, తునికి పండ్లు తీసుకురాగా వాటిని కొనేందుకు ప్రజలు ఆసక్తి చూపారు. పాలపండ్లు గ్లాసుకు 30 చొప్పున, తునికి పండ్లు రూ. 40 చొప్పున విక్రయించినప్పటికీ పెద్ద మొత్తంలో వాటిని కొనుగోలు చేశారు. అడవుల్లో ప్రకృతి సిద్ధంగా లభించే ఈ పండ్లలో అనేక ఔషధ గుణాలు ఉండడంతో ఆరోగ్యం కూడా లభిస్తుంది.

మినీ ట్యాంక్ బండ్‌పై సీసీ కెమెరాల ఏర్పాటు

మందమర్రిటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ, చెన్నూరు ఎమ్మెల్యే వివేక్‌వెంకటస్వామి చొరవతో మినీ ట్యాంక్‌బండ్ సుందరీకరించడంతో పాటు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు పాత బస్టాండ్ వాకర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బండి సదానందం యాదవ్ తెలిపారు. శుక్రవారం ట్యాంక్‌బండ్‌పై అమర్చిన సీసీ కెమెరాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ట్యాంక్‌బండ్‌పై రాత్రి మద్యం సేవించడంతో పాటు విద్యుత్ దీపాలను పగులగొట్టడం లాంటివి చేపడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లామన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్‌ను సమస్య పరిష్కరించాలని సూచించడంతో ట్యాంక్ బండ్ చుట్టు పక్కన ఉన్న పిచ్చి మొక్కలను తొలగించారన్నారు. అలాగే ఆసామీక కార్యకలాపాలు జరగకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.


సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న వాకర్స్ సభ్యులు

యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దు

తాండూర్ సీఐ కుమారస్వామి


మాట్లాడుతున్న సీఐ కుమారస్వామి

తాండూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దని తాండూర్ సీఐ కుమారస్వామి అన్నారు. సమాజంలో శాశ్వతంగా డ్రగ్స్‌ను నిర్మూలించేందుకు, యువత డ్రగ్స్ వైపు దృష్టి సారించకుండా ఉండేందుకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. శుక్రవారం తాండూర్ సీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాండూర్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో బెల్లంపల్లి సబ్ డివిజన్ స్థాయిలో పెద్ద ఎత్తున క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. బెల్లంపల్లి సబ్ డివిజన్ పరిధిలో ప్రతి మండలానికి రెండు టీంలు పాల్గొనవచ్చని, మొత్తం 20 టీంలు పాల్గొంటాయన్నారు. ఈ నెల 25న టోర్నమెంట్‌ను రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా ప్రారంభిస్తారన్నారు. యువత డ్రగ్స్‌కు బానిసలు కావద్దని, చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలపై మక్కువ పెంచుకుంటే చెడు వ్యసనాల జోలికి వెళ్లరని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐలు కిరణ్‌కుమార్, సౌజన్య, గంగారాం పాల్గొన్నారు.

మహిళకు నిత్యావసర సరుకుల అందజేత

కాసిపేట, ఏప్రిల్18 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి మండలం ఆకెనపల్లికి చెందిన వృద్ధురాలు సాన మల్లుకు కాసిపేట సింగరేణి 1వ గనికి చెందిన చేయూత స్వచ్ఛంద సంస్థ సభ్యులు నిత్యావసర సరుకులతో పాటు నగదును అందజేశారు. ఈ సందర్భంగా చేయూత స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు ఆకెపు రవీందర్ మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలకు చెందిన వారికి సంస్థ పరంగా సామాజిక కార్యక్రమాలు చేస్తూ మెరుగైన సమాజ నిర్మాణానికి చేయూతనందిస్తున్నామన్నారు. అందులో భాగంగానే సానమల్లు క్యాన్సర్ వ్యాధి బారినపడి అనేక ఇబ్బందులు పడుతుంది. పూటగడవడమే కష్టంగా ఉందని తెలుసుకున్న సభ్యులు సంస్థ తరుపున సాయం చేయాలని నిర్ణయించుకొని సాయం చేసినట్లు తెలిపారు. నిరుపేద మహిళను అన్ని విధాలుగా ఆదుకుంటామని భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సర్వే ఆఫీసర్ పండిత్ ప్రభాకర్, మహబూబ్‌ఖాన్, దాగాం మల్లేశ్, బొల్లం రాజకుమార్, అంకం రాజమల్లు, విజయ్, ప్రవీణ్, సిద్ధార్థ పాల్గొన్నారు.

'ఆంధ్రజ్యోతి' కార్, బైక్ రేస్ విజేతకు బహుమతి అందజేత



'ఆంధ్రజ్యోతి' కార్,బైక్ రేస్ ప్రథమ బహుమతి విజేత పెద్దపల్లి ఎన్టీపీసీకి చెందిన దేవునూరి శ్వేత, శ్రీహర్ష దంపతులకు బైక్ ను అందజేస్తున్న కరీంనగర్ బ్రాంచి మేనేజర్ కల్లెపు సంపత్ రెడ్డి, డిప్యూటీ సర్క్యులేషన్ మేనేజర్ పాపారావు, డిప్యూటీ మేనేజర్ (అడ్వర్టయిజ్‌మెంట్) శ్రావణ్

ఒకే దేశం ఒకే ఎన్నికపై అవగాహన

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల పట్టణం లోని డిగ్రీ కళాశాల మైదానంలో శుక్రవారం ఒకే దేశం ఒకే ఎన్నిక జిల్లా కన్వీనర్ దుర్గం అశోక్, కో-కన్వీనర్ తుల అంజనేయులులు ఒకేదేశం ఒకే ఎన్నికపై వాకర్‌లకు అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం దేశంలో ఏదో ఒకచోట ఎన్నికలు జరిగాయని, దీని వల్ల ప్రజా ధనం వృధా అవుతుందన్నారు. మాటి మాటికి ఎన్నికలు జరగడం వల్ల ఓటు వేయడానికి ఓటర్లు ఆసక్తి చూపరని తెలిపారు. ఒకేసారి ఎన్నికలు నిర్వహిస్తేనే బాగుంటుందన్నారు. కార్యక్రమంలో నాయకులు హరికృష్ణ, రాజ్‌కుమార్, అశోక్‌వర్ధన్, పురుషోత్తం, నాగేశ్వర్ రావు, తిరుపతిరెడ్డి, మధుసూదన్, వాకర్లు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టరేట్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ మే 20న చేపట్టినదేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల దాసు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దుంపల రంజిత్‌లు పేర్కొన్నారు. శుక్రవారం మంచిర్యాలలోని మార్క్స్‌భవన్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 27న మంచిర్యాలలోని మార్క్స్ భవన్‌లో కార్మిక సంఘాల సదస్సు నిర్వహిస్తున్నట్లు దీన్ని విజయవంతం చేయాలని, అలాగే మే 20న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో కార్మికులు, రైతులు, ప్రజలు పాల్గొనాలని కోరారు. ఈసమావేశంలో నాయకులు శ్రీనివాస్, దేవరాజు, మణిరాంసింగ్, రాజేశ్వరి, పోలు, ఖలీందర్ ఆలీఖాన్, రాములు పాల్గొన్నారు.

కౌలు రైతును ఆదుకునేదెప్పుడో..



- రూ. 15వేలు చెల్లిస్తామన్న కాంగ్రెస్
- ఏడాదిన్నర గడిచినా ఊసే ఎత్తని ప్రభుత్వం
- యేటేటా పెరుగుతున్న కౌలు రేట్లు
- కౌలు చట్టాలు అమలైతే 3 వేల మందికి మేలు



మంచిర్యాల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి): ఆరు గాలం రెక్కలు ముక్కలు చేసుకొని పంటలు పండిం చే కౌలు రైతులకు కాంగ్రెస్ ఇచ్చిన హామీ ఏడాదిన్నర గడి చినా నెరవేరడం లేదు. సార్వత్రిక ఎన్నికల హామీలో భాగంగా కౌలు రైతులకు ఏటా రూ. 15వేలు చెస్తామని కాంగ్రెస్‌పార్టీ స్పష్టం చేసింది. అయితే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ తన మాటను విస్మరించడంతో కౌలు రైతుల పరిస్థితి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది. ఇచ్చిన హామీని నెరవేర్చేం దుకు రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఒక దశలో కసరత్తు ప్రారంభించినప్పటికీ అది కార్యరూ పం దాల్చలేదు. కాంగ్రెస్ హామీ అమలైతే కౌలు రైతులకు మళ్లీ మంచి రోజులు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

యేటా పెరుగుతున్న కౌలు ధరలు...

భూముల కౌలు రేట్లు ప్రతియేటా పెరుగుతుండటంతో రైతులపై అధిక భారం పడుతోంది. ప్రస్తుతం నీటి వసతులు ఉన్నచోట ఎకరా భూమికి సంవత్సరానికి రూ. 16వేల పైచిలుకు ధరలు పలుకున్నాయి. నీ టి వసతులు తక్కువగా ఉన్నచోట రూ. 10వేల నుం చి 12వేల వరకు యజమానులు వసూలు చేస్తున్నా రు. కొంతకాలంగా కౌలు రేట్లను పరిశీలిస్తే దాదాపు మూడు రెట్లు పెరిగాయి. 2010లో ఎకరాకు రూ. 3 వేలు ఉన్న కౌలు భూముల ధరలు, 2011లో రూ. 4 వేలు, 2012లో రూ. 5 వేలు, 2013లో రూ. 6వేలు, 2014లో 7వేలు, 2015లో 8వేలు, 2016లో 9 వేలు, 2017లో 10వేలు, 2018లో రూ. 12వేలు ఉండగా, 2019లో రూ. 13వేలు, 2020లో 14వేలు, 2021లో 14 వేలు, 2022లో రూ. 15వేలు ఉండగా 2023, ఆ త రువాత రూ. 16వేల పై చిలుకు కౌలు రేట్లు పెరిగా యి. పంట దిగుబడితో సంబంధం లేకుండా అగ్రి మెంటు ప్రకారం భూముల యజమానులకు కౌలు రైతులు పై రేట్లు చెల్లించాల్సి వస్తోంది.

పెట్టుబడులూ అధికమే...

పంటలు పండించేందుకు కౌలు రైతులు పెట్టే పెట్టుబడులు సైతం అధికంగానే ఉంటున్నాయి. ఎకరా విస్తీర్ణం సాగు చేసేందుకు ఖర్చులు రూ. 25వేల వరకు అవుతున్నాయి. ట్రాక్టర్ కిరాయి రూ. 7 వేలు వెచ్చించాల్సి వస్తున్నట్లు రైతులు చెబుతున్నారు. అలాగే నాటు వేయడానికి రూ. 4 వేలు, ఎరువుల కోసం రూ. 8వేలు, కలుపు తొలగించేందుకు రూ. 3 వేలు, పంట సమయంలో కోత మెషీన్‌కు గంటన్నరకు రూ. 3000 చెల్లిస్తున్నారు. ఈ లెక్కన ఎకరా సాగు చేసేందుకు రైతులు సగటున రూ. 25 వేలకుపైగా ఖర్చు చేస్తున్నట్లు తెలుస్తోంది. పెట్టుబడులు కూడా ప్రతి సంవత్సరం పెరుగుతుండటంతో కౌలు రైతు అ ధిక భారం మోయక తప్పడంలేదు. గత సంవత్సరం 6 వేలు ఉన్న ట్రాక్టర్ కిరాయి ఈ సంవత్సరం వెయ్యి రూపాయల వరకు పెరిగింది. అలాగే ఎరువుల ధర లు సరాసరి రూ. 2వేల వరకు పెరిగినట్లు రైతులు వాపోతున్నారు. 2017 వరకు జిల్లాలో 300 మంది కౌలు రైతులు ఉండగా 172 మందికి ప్రభుత్వపరం గా గుర్తింపు కార్డులు అందజేశారు. రూ. 3లక్షల వరకు రుణం మంజూరు చేశారు. అనంతరం కౌలురైతు గుర్తింపు కార్డులను ప్రభుత్వం రద్దు చేయగా, బ్యాంకులు రుణాలు నిలిపి వేశాయి. దీంతో పంట పెట్టుబడుల కోసం ప్రైవేటు వడ్డీ వ్యాపారులను ఆ శ్రయించి, నిలువు దోపిడీకి గురవుతున్నారు.

చట్టాలు చచ్చు బండలు...

కౌలు రైతులకు సహాయ సహకారాలు అందించేందుకు ఉమ్మడి రాష్ట్రంలో ఆంధ్రప్రదేశ్ ల్యాండ్ లైసెన్స్‌డ్ కల్టివేటర్స్ రూల్స్-2012 చట్టం అమల్లో ఉండేది. అయితే బీఆర్ఎస్ ప్రభుత్వం

(తరువాయి 7లో)

కదిలిన వైద్య బృందం

- మాలగురిజాల గ్రామంలో వైద్య శిబిరం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



మాలగురిజాల గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న వైద్యుల బృందం

బెల్లంపల్లి, ఏప్రిల్18(ఆంధ్రజ్యోతి): 'ఊరంతా కిడ్నీ వ్యాధిగ్రస్తులే' అనే శీర్షికన ఆంధ్రజ్యోతి మెయిన్‌పేజీలో శుక్రవారం ప్రచురితమైన కథనానికి జి ల్లా వైద్యారోగ్యశాఖ స్పందించింది. శుక్రవారం బెల్లంపల్లి మండలంలోని మా లగురిజాల గ్రామంలో డిప్యూటి డిఎంహెచ్‌వో సుధాకర్‌నాయక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో 80మందికి వైద్య పరీక్షలు చేశారు. ఇందులో పదిమందికి కిడ్నీ సమస్యలతో బాధపడుతున్నట్లు గుర్తించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు మాలగురిజాల గ్రామంలో వైద్యశిబిరం నిర్వహిస్తామన్నారు. నాలుగువైద్య బృందాలతో గ్రామంలోని 250 ఇండ్లను పరిశీలిస్తామన్నారు. రక్తమూత్ర పరీక్షలను నిర్వహించి టీహబ్‌కు పరీక్షల నిమిత్తం పంపిస్తామన్నారు. అలాగే గ్రామంలోని బోరునీ రును వరంగల్‌లోని ల్యాబ్‌కు పంపించి పరీక్షలు చేయిస్తామన్నారు. ఈ కా ర్యక్రమంలో వైద్యురాలు ఎవాంజలిన్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వెంకటేశ్వ ర్లు, జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ వెంకటేశ్వర్, హెల్త్ సూపర్‌వైజర్ మల్లి కాంబ, ఎఎన్ఎం చంద్రకళ, ఎపడమిక్ ఇంచార్జీ మురళి, హెల్త్ అసిస్టెంట్ శివగణేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మావోయిస్టులతోనే వెనుకబాటుతనం

జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



సమావేశంలో మాట్లాడుతున్న జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

చెన్నూరు, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : గతంలో మావోయిస్టు పార్టీ కార్యకలాపాలతోనే ఈ ప్రాంతం వెనకబాటు తనానికి గురైందని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం స్థానిక పోలీస్‌స్టేష న్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం రాత్రి చెన్నూరు, కోటపల్లి, వేమనపల్లి, భీమారం మండలాల్లోని పలు గ్రామాల్లో మా వోయిస్టు కార్యకలాపాలకు వ్యతిరేకంగా వాల్ పోస్టర్లు వెలిశాయన్నారు. వెలిసిన వాల్ పోస్టర్లపై ప్రాథమిక విచారణ చేపట్టగా ఆదివాసీ సంఘం నాయకులు పోస్టర్లు వేసినట్లు తెలిసిందన్నారు. మావోయిస్టులు ము ఖ్యంగా ఆదివాసీలను ప్రలోభ పెట్టి పార్టీలో చేర్చు కుంటున్నారన్నారు. పదేళ్ల క్రితం మావోయిస్టు కార్యక లాపాల మూలంగా ఈ ప్రాంతం అభివృద్ధి చెందలేదన్నారు. మావోయిస్టు సిద్ధాంతాలకు కాలం చెల్లిందన్నారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో మావోయిస్టులను ఏరి వేస్తు న్నారన్నారు. మావోయిస్టు పార్టీలోకి ఎవరు వెళ్లకూడదన్నారు. ఎవరైనా పార్టీ కార్యాకలాపాల్లో పాల్గొంటే స్వచ్చందంగా లొంగి పోవచ్చని సూచించారు. వారికి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేందుకు కృషి చేస్తామన్నారు. మావోయిస్టులపై తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. వాల్ పోస్టర్లు వేసిన ఆదివాసీ యువకులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో చెన్నూరు, రూరల్ సీఐలు దేవేందర్‌రావు, సుధాకర్‌లు పాల్గొన్నారు.

గిరిజనులకు న్యాయం చేస్తాం

వేమనపల్లి : మండలంలో అగ్ర వర్ణాల వారు గిరి జనులు, దళితుల భూములను అక్రమంగా ఆక్రమిస్తే బాధితులు తమకు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి న్యాయం చేస్తామని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ సూ చించారు. శుక్రవారం నీల్వాయి పోలీస్‌స్టేషన్‌లో మంగెనపల్లి గిరిజనులతో సమావేశంలో నిర్వహించారు. మంగెనపల్లి గ్రామానికి చెందిన నాయిని కన్నయ్య యజమాని వేధింపులు భరించలేక ఆత్మహత్య చేసుకోవడం, కన్నయ్య కుటుంబానికి చెందిన భూమిని యాజమాని కుటుంబ సభ్యులు అక్రమంగా లాక్కోవడంపై ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఏసీపీకి ఫిర్యాదు చేశారు. రెవెన్యూ అధికారుల సహాయంతో పూర్తి విచారణ జరిపి కన్నయ్య కుటుంబానికి చెందిన భూమిని పట్టా చేసుకున్నారని తెలిస్తే న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆత్మహత్య చేసుకున్న కన్నయ్య కుటుంబానికి న్యాయం చేయాలని, గిరిజనులు కోరారు. చెన్నూరు రూరల్ సీఐ సుధాకర్, నీల్వాయి ఎస్ఐ శ్యామ్‌పటేల్ పాల్గొన్నారు.

జిల్లాలో ముమ్మరంగా పశువులకు టీకాలు

- గాలికుంటు వ్యాధిపై జాగ్రత్తలు తీసుకోవాలంటున్న పశు వైద్యులు



కాసిపేటలో పశువుకు టీకా వేస్తున్న వైద్యులు

నస్పూర్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా పశువులు గాలికుంట వ్యాధి బారిన పడే ప్రమాదం ఉంది. వస్తున్న మార్పులతో పశువులకు రక్షణగా వ్యాక్సినేషన్ చేయిస్తే వాటికి రక్షణగా ఉంటుందని పశుసంవర్ధకశాఖ అధికారులు సూచిస్తున్నారు. పశువులు వ్యాధి బారినపడి మృత్యువాత పడే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వం అందించే ఉచిత టీకాల కార్యక్రమాన్ని చేపట్టింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా పశువులకు టీకాలువేసే కార్యక్రమంలో పశు సంవర్ధక శాఖ వైద్యులు, సిబ్బంది నిమగ్నమైయ్యారు. జిల్లా వ్యాప్తంగా 2.20లక్షల పశువులకు టీకాలు వేయాలని లక్ష్యంగా శాఖ నిర్ణయించింది. ఈ నెల 15 నుంచి వచ్చే 15వ తేదీ వరకు మాసంరోజుల పాటు జిల్లా టీకాల కార్యక్రమం కొనసాగుతుంది. శుక్రవారం నాటికి 10.62 శాతం పశువులకు టీకాలు వేసారు. నెల రోజుల పాటు జిల్లాలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు టీకాల కార్యక్రమం నిర్వహిస్తున్నమని జిల్లా పశు వైద్యాధికారి శంకర్ తెలిపారు. యాజమానులు తప్ప కుండా వారివారీ పశువులకు టీకాలను వేయించాలని సూచించారు.

దండేపల్లి : గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధక శాఖ నిర్వహించే పశువైద్య శిబిరాలోని పశుపోషకులు గాలికుంటు వ్యాధి నివారణ టికాలు తప్పని సరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ ధన్‌రాజ్ సూచించారు. మండలంలోని గూడెంలో శుక్రవారం 697 పశువులకు గాలికుంటువ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈకార్యక్రమంలో పశు వైద్యాధికారి డా. సుజాత, సిబ్బంది సత్తయ్య, ప్రభు, ఇందిర, శ్రీనివాస్, అంజామ్, కుమార్ రైతులు పాల్గొన్నారు.

మందమర్రి బస్టాండ్‌కు హైదరాబాద్ బస్సులు వచ్చేదెప్పుడు..

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



మందమర్రి ఆర్టీసీ బస్టాండ్

మందమర్రిటౌన్, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణం నడిబొడ్డున ఉన్న ఆర్టీసీ బస్టాండ్‌కు హైద్రాబాద్‌కు వెళ్లే బస్సులు రాక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రాత్రి 11 గంటలకు, 10.20 గంటలకు బస్సులు నడిచేవి. దీంతో చాలా మంది రాత్రిపూటనే వెళ్లేవారు. ప్రస్తుతం 10.20 గంటల బస్సు మాత్రమే నడవడం, 11 గంటల బస్సు రద్దు కావడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రెండు నెలలుగా ఈ బస్సు నడవడం లేదని వాపోతున్నారు. మందమర్రి నుంచి 12 కిలోమీటర్ల దూరంలో ఉన్న మంచిర్యాల బస్టాండ్‌కు వెళ్లి హైద్రాబాద్‌కు వెళ్తున్నారు. ఇక్కడ కూడా సీట్లు దొరక్కపోవడంతో ప్రైవేటు వాహనాల్లో హైద్రాబాద్‌కు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. విద్యార్థినీ, విద్యార్థులు హైద్రాబాద్‌కు సరిపడేవన్నీ బస్సులు నడవక ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై ఎంపీ, ఎమ్మెల్యేలకు వినతి పత్రాలు ఇచ్చేందుకు ప్రజలు సిద్దమ వుతున్నారు.

విద్యార్థులకు అభినందన

జన్నారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రేండ్లగూడ గ్రామానికి చెందిన బోర్లకుంట పల్లవి ఎంబీబీఎస్ పూర్తి చేసి పీజీ చదువుతుందని, అలాగే ఇదే గ్రామానికి చెందిన మ్యాద్యూస్ ఎంబీబీఎస్ పాస్ కావడంతో ఇద్దర్ని శుక్రవారం మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు సిటిమల భరత్‌కుమార్ అభినందించారు. ఆయన మాట్లాడుతూ నిరుపేద కుటుంబాల్లో పుట్టి కష్టపడి చదివి వైద్యులు కావడం ఆనందంగా ఉందని తెలిపారు. పేదలకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కార్యక్రమంలో మామిడిపల్లి ఇందయ్య, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా గుడ్ ఫ్రైడే వేడుకలు



మందమర్రి సీఎస్: చర్చిలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



మంచిర్యాలలో ఏసు శిలువతో ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

గర్మిళ్ల, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాల క్యాథలిక్ సేక్రడ్ హార్ట్ చర్చి ఆధ్వర్యంలో శుక్రవారం గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఊరేగింపుగా మందమర్రి మండలంలోని బొక్కలగుట్ట గ్రామంలోని రక్షణ గిరిపై ఏసు ప్రభు శిలువ యాత్రలోని 14సంఘటనలను గుర్తుచేసుకున్నారు. యువకులు ఏసుప్రభు, సైనికులు, మేరి మాత వేషధారణతో భక్తులను ఆకట్టుకున్నారు. అనంతరం మంచిర్యాలలోని చర్చికివచ్చి యేసు ప్రభు శ్రమల చరిత్రను భక్తులకు చదివి వినిపించారు. చర్చి ఫాదర్‌జోష్ మాజిక్యతన్, ఫాదర్ జెన్సన్, పాస్టర్లు, క్రైస్తవులు పాల్గొన్నారు.

దండేపల్లి: మండలంలోని పలు గ్రామాలోని చర్చిలలో క్రైస్తావులు శుక్రవారం భక్తి శ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. తెల్లవారుజామున క్రైస్తవులు ఆయా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు జరుపుతుకున్నారు.


భీమారం: భీమారం మండల వ్యాప్తంగా ఉన్న చర్చిల్లో గుడ్‌ఫ్రైడే వేడుకలను చర్చి ఫాదర్లు, పాస్టర్లు, క్రైస్తవ భక్తులు అభిమానులు ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ భక్తజనానికి, మండలానికి సందేశం అందించారు. ఫాదర్ జోబితో పాటు పాస్టర్ రాజేశ్, తిమోతి, సత్యరాజ్, సంఘ పెద్దలు భూపెల్లి రాజయ్య, తగరం మొండితో పాటు పలువురు ఉన్నారు. భీమారం మండల కేంద్రంలో సుమ క్యాథలిక్ చర్చి ఆధ్వర్యంలో ఏసు శిలువ మార్గమును ఊరేగింపు నిర్వహించారు.

మందమర్రి: పట్టణంలో శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను క్రైస్తవ కుటుంబాలు ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ఆయా చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. స్థానిక సీఐఎస్ఎఫ్ చర్చిలో ఈస్టర్‌డే ప్రాముఖ్యతను పాస్టర్ రేవాబం టు జెర్మియా వివరించారు.

- స్థానిక పాల చెట్టు ఏరియాలోని బెతస్థ చర్చి వద్ద గుడ్‌ఫ్రైడే వేడుకలు నిర్వహించారు. ముం దుగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం బేతస్త వాలంటరీ ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. పాస్టర్ ఆనంద్, సభ్యులు స్టీఫెన్, సురేందర్, సిహెచ్ మల్లేశ్ పాల్గొన్నారు.

నస్పూర్: నస్పూర్ పట్టణంలోని వివిధ చర్చిల్లో శుక్రవారం గుడ్‌ఫ్రైడే సందర్భంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. గుడ్ ఫ్రైడేను పురస్కరించుకుని ఆయా ప్రాంతాల్లోని చర్చిలను ముస్తాబు చేశారు. పెద్ద ఎత్తున భక్తులు చర్చిలకు చేరుకుని యేసు క్రీస్తును ప్రార్థించారు.

దండేపల్లి: స్థానిక సంఘం మొదల సీఎస్ఐ చర్చిలో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మోదెల స్థానిక సీఎస్ఐ చర్చి పాస్టర్ డేవిడ్ పాల్ ఆఫీస్ బేరర్స్ ప్రసాద్ పాల్గొన్నారు.



నస్పూర్‌లోని చర్చిలో ప్రార్థన చేస్తున్న క్రైస్తవులు

మార్పు కోరుతూ.. ముందుకెళ్తూ.. 7

- గుడుంబా నిర్మూలించేందుకు పోలీసుల కృషి

రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయం

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు



ఇందన్‌పల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

జన్నారం, ఏప్రిల్ 18 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో వరికొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.2లక్షలలోపు రుణ మాఫీ చేసిందని, పంటలకు మద్దతు ధర కల్పిస్తుందన్నారు. రైతులుందరు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి మద్దతుధర పొందాలన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.